ప్రజాశక్తి

ఆదివారం 23 మార్చి 2025 | 8 పేజీలు

ఎన్‌టిఆర్ | కృష్ణా

మాట్లాడుతున్న టిడిపి ఫ్లోర్‌లీడర్ బాలస్వామి, సిపిఎం ఫ్లోర్‌లీడర్ సత్యబాబు (అంతర్‌చిత్రాల్లో)

అధ్యక్షస్థానంలో ఉన్న మేయర్ భాగ్యలక్ష్మి, మాట్లాడుతున్న వైసిపి ఫ్లోర్‌లీడర్ సత్యనారాయణ

రూ.1659 కోట్లతో విఎంసి బడ్జెట్

● ఆదాయం రూ.1262.47 కోట్లు ● ఖర్చు రూ.1454.56 కోట్లు

ప్రజాశక్తి - విజయవాడ

విజయవాడ నగరపాలక సంస్థ 2025-26 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్ రూ.1659.15 కోట్లతో ఆమోదం పొందింది. విపక్ష సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు నిరసనల నడుమ అధికార వైసిపి బడ్జెట్ సమావేశాన్ని హడావుడిగా ముగించింది. సిపిఎం ప్రతిపాదించిన సవరణల తీర్మానాలను తిరస్కరించింది. మేయర్ రాయన భాగ్యలక్ష్మీ అధ్యక్షతన శనివారం విఎంసి బడ్జెట్‌పై కౌన్సిల్ సమావేశం జరిగింది. 2025-26లో రూ.1659.15 కోట్ల మేర ఆదాయ వనరులు సమకూరుతాయనే అంచనాలతో అధికార వైసిపి బడ్జెట్‌ను ఆమోదించేసింది. రెవెన్యూ, క్యాపిటల్ ఆదాయాలు రూ.1262.47 కోట్లు, డిపాజిట్ల రూపంలో రూ.47.04 కోట్లు, ప్రారంభనిల్వ రూ. 349.63 కోట్లుగా అధికారపక్షం చూపింది. మొత్తం కలుపుకొని ఆదాయం రూ.1659.15 కోట్లు రావచ్చని అంచనా వేసింది. రెవెన్యూ, క్యాపిటల్ వ్యయాలు, రుణాలు, డిపాజిట్ల చెల్లింపులతో కలుపుకొని రూ.1454.56 కోట్లు ఖర్చులుగా అంచనా వేసింది. రూ.204.59 కోట్లను అంత్య నిల్వగా బడ్జెట్లో పొందుపరిచారు. రెవెన్యూ ఆదాయాల విషయానికి వస్తే... పన్నుల ద్వారా రూ.332.86 కోట్లు (41.18 శాతం), అసైన్డ్ రెవెన్యూ రూ.48.32 కోట్లు (5.98 శాతం), టౌన్‌ప్లానింగ్, ఇతర మార్గాల ద్వారా రూ.61.46 కోట్లు (7.60 శాతం), లైసెన్స్‌ఫీజులు, అడ్మినిస్ట్రేటివ్ ఛార్జీల ద్వారా రూ.7.30 కోట్లు (0.90శాతం), అమ్మకాలు, అద్దెల రూపంలో రూ.0.87 కోట్లు (0.11 శాతం), మార్కెట్, రెమ్యూనరేటివ్ ఎంటర్ప్రైజెస్ ద్వారా రూ.37.15 కోట్లు (4.60 శాతం), వాటర్ సప్లై, యుజిడి రూపంలో (మిగతా 2లో)

బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు

ప్రజారంజకం : మేయర్ భాగ్యలక్ష్మి

విజయవాడ నగర పాలక సంస్థ బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇది ప్రజారంజక బడ్జెట్ అని అధికార వైసిపి సభ్యులు పేర్కొనగా, ప్రజావ్యతిరేక, తిరోగమన, అంకెలగారడీ బడ్జెట్ అని విపక్ష టిడిపి, సిపిఎం సభ్యులు విమర్శించారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మీ అధ్యక్షతన శనివారం జరిగిన బడ్జెట్ సమావేశంలో అధికార వైసిపి, ప్రధాన ప్రతిపక్షం టిడిపి, సిపిఎం సభ్యులు బడ్జెట్‌లోని లోపాలు, దాని డొల్లతనాన్ని ఎత్తి చూపారు. అధ్యక్ష స్థానంలో ఉన్న మేయర్ మాత్రం నూతన బడ్జెట్‌ను ప్రవేశపెట్టి, గత సంవత్సర కాలంలో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి 19 పేజీల ప్రసంగం పాఠవాన్ని 45 నిమిషాలకుపైగా చదివారు. ప్రజలపై ఎటువంటి పన్నుల భారం మోపకుండానే పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టినట్లు మేయర్ చెప్పుకొచ్చారు. ఆదాయ వ్యాయాలను అంచనా వేస్తూ నగర సమగ్రాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని బడ్జెట్‌ను రూపొందించినట్లు చెప్పారు. సిఎం చంద్రబాబు, మున్సిపల్ మంత్రి, విజయవాడ ఎంపి, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, అధికారులు, తోటి కార్పొరేటర్లకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నట్లు పేర్కొన్నారు.

అంకెలగారడీ, ఊహాజనితం

టిడిపి ఫ్లోర్‌లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి

టిడిపి ఫ్లోర్‌లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి మాట్లాడుతూ అంకెలగారడీతో బడ్జెట్ ఊహాజనితంగా ఉందని విమర్శించారు. అంచనాలు ఆకాశంలో, అభివృద్ధి పాతాళంలో అన్నట్లు ఉందన్నారు. భారాలు పడకుండా, నగరాభివృద్ధికి సంబంధించిన పలు పద్దుల కింద బడ్జెట్లో సవరణలు (మిగతా 2లో)

కౌన్సిల్ బయట నిరసన తెలుపుతున్న సత్యబాబు

పలు సవరణలకు సిపిఎం డిసెంట్ నోట్

పట్టించుకోని మేయర్

రికార్డుల్లో నమోదు చేయకుండానే హడావుడిగా బడ్జెట్ ఆమోదం

బడ్జెట్‌లోని పలు పద్దుల్లో చూపిన రెవెన్యూ, క్యాపిటల్ ఖర్చుల్లో సవరణలు చేయాలని సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు కోరారు. ఈమేరకు పలు అంశాలపై మేయర్ భాగ్యలక్ష్మికి ఆయన డిసెంట్ నోట్ అందజేశారు. బడ్జెట్ అంచనాల్లో ప్రకటనల ప్రచార ఖర్చులకు కేటాయించిన రూ.5 కోట్లను రూ.3 కోట్లకు పరిమితం చేయాలని కోరారు. ఇంజినీరింగ్ పనులకు రూ.11 కోట్ల అంచనాలను రూ.10 కోట్లకు కుదించాలని, కన్సల్టెంట్ రెమ్యునరేషన్ చెల్లింపులు రూ.3.41 కోట్లకు (మిగతా 2లో)

కృష్ణాకరకట్ట ఇళ్లకు శాశ్వత హక్కు కల్పించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

ప్రజాశక్తి - విజయవాడ : పి 4 పేరుతో పేదరిక నిర్మూలన అంటూ మరోవైపు, వేల ఎకరాల భూములను కార్పొరేట్లకు అప్పగిస్తున్న ప్రభుత్వం... 50 ఏళ్లుగా నివాసం ఉంటున్న పేదల ఇళ్లకు రిజిస్ట్రేషన్‌తో కూడిన పట్టాలు ఇచ్చి, శాశ్వత హక్కు ఎందుకు కల్పించడంలేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు ప్రశ్నించారు. ఇళ్ల పట్టాలు, రిజిస్ట్రేషన్లు, ఇళ్ల తదితర సమస్యలపై ఈనెల 28న కలెక్టరేట్ వద్ద జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ కృష్ణలంక 21వ డివిజన్లో సిపిఎం ఆధ్వర్యాన శనివారం ప్రచార పాదయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా బాబూరావు మాట్లాడుతూ కష్ణా నదీతీరానే పెద్ద పెద్ద విశ్రాంతి భవనాలు, నాయకుల గెస్ట్‌హౌస్‌లు, భవంతులకు అనుమతులిచ్చి, పేదల పూరి గుడిసెలు, రేకులషెడ్లు పైకప్పు (మిగతా 2లో)

ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం నేతలు బాబూరావు, కాశీనాథ్, కృష్ణ తదితరులు

టెన్త్ ఇన్విజిలేటర్ శైలజ సస్పెన్షన్

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం, విజయవాడ అర్బన్ : ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని డాన్ బాస్కో ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలోని పదో తరగతి పరీక్షా కేంద్రంలో బాధ్యతారాహిత్యంగా ఇన్విజిలేటర్ విధులు నిర్వహించిన తెలుగు స్కూల్ అసిస్టెంట్ టీచర్ ఎస్.శైలజను సస్పెండ్ చేస్తూ ఎన్‌టిఆర్ జిల్లా విద్యాశాఖాధికారి యు.వి.ఎస్.రావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త సిలబస్ విద్యార్థులకు పాత సిలబస్ పరీక్షా పేపర్ ఇవ్వడంతో విద్యార్థులు అదే పేపర్‌పై పరీక్ష రాశారు. పరీక్ష ముగిసిన తర్వాత పేపరు మారినట్లు గుర్తించారు. ఈ విషయంపై బాధ్యతారహితంగా విధులు నిర్వహించిన ఇన్విజిలేటర్ శైలజను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సంబంధిత పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కె.జె.ఎన్.లక్ష్మి, డిపార్ట్‌మెంట్ (మిగతా 2లో)

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి వల్లభనేని బాలశౌరి; చిత్రంలో మంత్రి కొల్లు రవీంద్ర, జడ్‌పి చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, కలెక్టర్ డికె.బాలాజీ తదితరులు

రైతులు, నిరుద్యోగులకు విరివిగా రుణాలు

జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీలో ఎంపి బాలశౌరి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : రైతులు, నిరుద్యోగ యువతకు విరివిగా రుణాలు అందించి వారి సంక్షేమం, అభివద్ధికి కషి చేయాలని మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి బ్యాంకు అధికారులను కోరారు. మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్లో శనివారం ఎంపి బాలశౌరి అధ్యక్షతన జిల్లా అభివద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం జరిగింది. సమావేశంలో రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఉప్పాల హారిక, పెడన, అవనిగడ్డ, పామర్రు ఎంఎల్‌ఎలు కాగిత కష్ణ ప్రసాద్, మండలి బుద్ధ ప్రసాద్, వర్ల కుమార్ రాజా తదితర ప్రజాప్రతినిధులతో కలిసి కేంద్ర ప్రభుత్వ పథకాల వినియోగంపై వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, బ్యాంకర్లతో సమీక్షించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, దివ్యాంగుల సంక్షేమం, గ్రామీణ నీటిపారుదల విభాగం, గహ నిర్మాణం, వ్యవసాయం, ఇరిగేషన్, వైద్య ఆరోగ్యం, మహిళాభివద్ధి, శిశు సంక్షేమం, జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ, రహదారులు భవనాలు, జాతీయ రహదారులు, పరిశ్రమలు, భూ రికార్డులు సర్వే, విద్యుత్, పౌరసరఫరాలు, పంచాయతీరాజ్, సమగ్ర శిక్ష, చేనేత, మత్స్య, మున్సిపాలిటీలు, నైపుణ్య అభివద్ధి తదితర శాఖలకు చెందిన కేంద్ర ప్రభుత్వ పథకాల సద్వినియోగం, వాటి అమలులోని సమస్యలపై ఎంపి చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ ఆయా శాఖల జిల్లా అధికారులు కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రత్యేక దష్టి సారించి ప్రజలు వాటిని సక్రమంగా సద్వినియోగం చేసుకునే విధంగా కషి చేయాలన్నారు. లబ్ధిదారులను గుర్తించి వారి అభ్యున్నతికి కషి చేయాలని సూచించారు. పథకాల అమలులోని సమస్యలను గుర్తించి వాటిని కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధుల దష్టికి తీసుకువస్తే ప్రభుత్వానికి నివేదించడానికి అవకాశం ఉంటుందన్నారు. మత్స్యకారుల కోసం వలలు, ఐస్ బాక్సులు, మోటార్ సైకిళ్ల తదితర అవసరాల కోసం ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి నివేదించాలని, మిగిలిన శాఖలు సైతం వారి పరిధిలోని పథకాల అమలులో అవసరమైన (మిగతా 2లో)

23-3-2025 ఆదివారం

ఇఫ్తార్ (సాయంత్రం) : 6.24

24-03-2025 సోమవారం

సహర్ (ఉదయం) : 4.52

కంచికచర్ల జడ్‌పిటిసి భర్త రమేష్ అరెస్టుకు యత్నం

ఇంటిని చుట్టుముట్టిన పోలీసులు

ప్రజాశక్తి - కంచికచర్ల : ఎన్‌టిఆర్ జిల్లా కంచికచర్ల జడ్‌పిటిసి సభ్యులు వేల్పుల ప్రశాంతి భర్త, వైసిపి సీనియర్ నాయకుడు వేల్పుల రమేష్‌ను అరెస్టుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. మండలంలోని కీసర గ్రామంలో గల ఆయన ఇంటిని కంచికచర్ల పోలీసులు చుట్టుముట్టారు. ఇటీవల తెలంగాణ రాష్ట్రం మధిర మండలం భయ్యారం గ్రామానికి చెందిన ఓ మహిళకు సంబంధించిన ఆస్తిని వేరొకరికి ఇప్పించడంలో కీలక పాత్ర పోషించినట్లు సమాచారం ఉండడంతో ఆయనను అరెస్టు చేస్తారని సమాచారం. వేల్పుల రమేష్ ఇంటి వద్ద శనివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి అర్ధరాత్రి వరకు హైడ్రామా నడుస్తోంది. రమేష్ ఇంట్లో ఉన్న విషయాన్ని తెలుసుకున్న ఎస్ఐ రాజు తన సిబ్బందితో ఇంట్లోకి వెళ్లి అదుపులోకి తీసుకోవాలని ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. దీంతో తన భర్తను ఎందుకు అరెస్టు చేస్తున్నారో వివరాలు తెలపాలని, ముందు నోటీసు ఇవ్వాలని జడ్‌పిటిసి ప్రశాంతి కోరారు. అంతేగాక పోలీసులను నిలువరించారు. ఆ తర్వాత సిఐ కార్యాలయానికి వెళ్లి ఆయనతో మాట్లాడారు. అలాగే తనను ఏ కేసులో అరెస్ట్ చేయటానికి వచ్చారో వివరాలు తెలపాలని రమేష్ కూడా పోలీసులను కోరారు.

రైతులు, నిరుద్యోగులకు విరివిగా రుణాలు

(మొదటి పేజీ తరువాయి)

నిధుల కోసం ప్రతిపాదనలు పంపాలని సూచించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద గ్రామాల్లో డొంక రోడ్ల నిర్మాణానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని, నిర్మాణంలో నిలిచిపోయిన పాఠశాలల భవనాలను తక్షణమే పూర్తి చేయడానికి కషి చేయాలని అన్నారు. మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ నియోజకవర్గాల్లోని సుముద్ర తీర ప్రాంత గ్రామాల్లో తాగునీటి సమస్య అధికంగా ఉందన్నారు. వచ్చే వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా రూ.2 కోట్ల వరకు నిధులను మంజూరు చేస్తామన్నారు. ఎక్కడ కూడా నీటి సమస్య తలెత్తకుండా చూడాలని, అవసరమైన చోట్ల ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందించాలని అన్నారు. అధికారులు నిత్యం గ్రామాల్లో క్షేత్రస్థాయి పర్యటన జరిపి నీటి నాణ్యతను పరిశీలించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం కిసాన్ క్రెడిట్ కార్డుల రుణ పరిమితి పెంచిందని, ఈ నేపథ్యంలో జిల్లాలో ఎంతమంది రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు ఇప్పించారని ఎంపీ బాలశౌరి వ్యవసాయ అధికారులను ప్రశ్నించారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా వచ్చే నిధులను సక్రమంగా సద్వినియోగం చేసేందుకు అధికారులు కషి చేయాలని సూచించారు. ముఖ్యంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, జల జీవన్ మిషన్ పథకం ద్వారా వస్తున్న నిధులు సద్వినియోగం అవుతున్నందున వీటిపై ప్రత్యేక దష్టి సాధించాలన్నారు. అలాగే మచిలీపట్నం ప్రాంతంలో గోల్డ్ కవరింగ్, కలంకారి, ఆటోనగర్, మత్స్య సంపద ఆధారంగా పరిశ్రమలు అభివద్ధి చెందే అవకాశం ఉందన్నారు. ఈనేపథ్యంలో 300 ఎకరాల్లో ఎంఎస్‌ఎంఇ పార్కు నిర్మాణం, 6వేల ఎకరాల్లో ప్రధాన పరిశ్రమల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, దీనికి బ్యాంకులు సహకారం అందించాలని మంత్రి కోరారు. కలెక్టర్ డికె.బాలాజీ మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఈజీఎస్, సామాజిక భద్రతా పథకాలు, జల్‌జీవన్ మిషన్, గహ నిర్మాణం తదితర పథకాల పురోగతిపై చర్చించి అవసరమైన చర్యలు తీసుకోవడం ఈ సమావేశం ముఖ్య ఉద్దేశమన్నారు. తొలుత జడ్‌పి సిఇఒ కన్నమనాయుడు దిశ కమిటీలోని నామినేటెడ్ సభ్యులను ప్రకటించారు. పలు మండలాల నుండి సభ్యులను ప్రకటించారు. తోట్లవల్లూరుకు పిరటి సుజాత, మోపిదేవికి అరజ సంధ్యారాణి, నందివాడకు సింగాల రాధాకష్ణ, పెనమలూరుకు లింగాల భాస్కరరావు, బాపులపాడుకు కసుకుర్తి రంగమణి, మచిలీపట్నం (శారదా నగర్)కు ఉడుముల బుజ్జి, నాగాయలంకకు నక్కా విజయబాబు, మచిలీపట్నం (ఈడేపల్లి)కు మహమ్మద్ షాహీన, కత్తివెన్నుకు తిరుమణి బలరాంను ప్రకటించారు. ఈకార్యక్రమంలో గుడివాడ మాజీ ఎంఎల్‌ఎ రావి వెంకటేశ్వరరావు, ఇండియన్ బ్యాంక్ సీజీఎం సుజయ్ మల్లిక్, ఎస్‌బిఐ జిఎం శైలేష్ కుమార్, పంజాబ్ నేషనల్ బ్యాంక్ జిఎం దీపక్ కుమార్ శ్రీవాస్తవ, యూనియన్ బ్యాంక్ డిజిఎం సీతారామారావు, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ డిజిఎం అమిత్ కుమార్ శుక్ల, యునైటెడ్ కమర్షియల్ బ్యాంక్ డిజిఎం శ్రీకాంత్, సెంట్రల్ బ్యాంక్ ఎజిఎం పి.సతీష్, నాబార్డ్ జిఎం డాక్టర్ కె.వి.ఎస్.ప్రసాద్, కూటమి నాయకులు బండి రామకష్ణ, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, పలువురు జడ్‌పిటిసి సభ్యులు పాల్గొన్నారు.

టెన్త్ ఇన్విజిలేటర్ శైలజ సస్పెన్షన్

(మొదటి పేజీ తరువాయి)

ఆఫీసర్ జె.విద్యాసాగర్‌లను బాధ్యులు చేస్తూ షోకాస్ నోటీసులు జారీ చేశారు. కాగా పదో తరగతి పరీక్షల్లో భాగంగా ఎన్టీఆర్ జిల్లాలో నాలుగో రోజు సంస్కతం పరీక్ష మొత్తం 137 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించారు. మొత్తం రెగ్యులర్ విద్యార్థులు 6191 మంది కాగా, 6,162 మంది పరీక్షకు హాజరయ్యారు. అలాగే ప్రైవేటు విద్యార్థులు 42 మందికిగాను 35 మంది విద్యార్థులు హాజరయ్యారు మొత్తం హాజరు శాతం 99.53గా ఉంది.

కృష్ణాకరకట్ట ఇళ్లకు శాశ్వత హక్కు కల్పించాలి

(మొదటి పేజీ తరువాయి)

మార్చుకునేందుకు అనుమతులు ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. అసెంబ్లీ సాక్షిగా అక్రమ నిర్మాణ భవనాలకు అనుమతుల గురించి అధికారులపై రుబాబు చేస్తున్నట్లు అధికార పార్టీ ప్రజా ప్రతినిధులపై వార్తలు వస్తున్నాయన్నారు. అధికారులపైనే కాదు, పేదలు, చిరువ్యాపారులపై కూడా అధికార పార్టీ నాయకుల దౌర్జన్యాలు అదే రీతిలో ఉన్నాయన్నారు. పేదలు, చిన్న వ్యాపారుల పొట్టకొడుతున్నారని అన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ కష్ణా కరకట్ట పరిధిలోని ఇళ్లకు శాశ్వత హక్కు కల్పించాలని, రిజిస్ట్రేషన్ పట్టాలు ఇచ్చి పై కప్పు మార్చిడికి అవకాశం కల్పించాలని, ఇతరులకు ఇచ్చినట్లే రూ.5 లక్షలు ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. టిడ్కో లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించాలని కోరారు. ఈకార్యక్రమంలో సిపిఎం తూర్పు నగర కార్యదర్శి పి.కష్ణ, నగర కార్యదర్శి వర్గ సభ్యులు కోరాడ రమణ, స్థానిక నాయకులు శ్రీరాములు, కుమార్, గోపి, అప్పల నాయుడు, కసర లక్ష్మణ, గోపాల్, రాజా పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, మధిర బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపినస్థిరాస్తిని రిజిస్ట్రార్ తనఖా చేయించుకొని **నీలం సీతమ్మ భర్త : శేషయ్య,** వయస్సు :45 సంII లు, నివాసం : కంభంపాడు గ్రామం, వత్సవాయి మండలం, యన్.టి.ఆర్. జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లైయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 3 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చుఅభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి :యన్.టి.ఆర్., జగ్గయ్యపేట సబ్II డిII జగ్గయ్యపేట సబ్-రిజిస్ట్రారు వారి యిలాకా, వత్సవాయి మండలం, కంభంపాడు గ్రామ పంచాయితీ లిమిట్సులోని కంభంపాడు గ్రామంలోని, గిఫ్ట్ సెటిల్‌మెంట్ డీడ్ నెం.**11456/2024**, ఆర్.ఎస్.నె.301/1ఎ లో య.0.03 సెంట్లు లేక చ.గ. 145.2. లు నివేశన స్థలము మరియు ఇందులో నిర్మించబడిన డోర్.నెం.2-179, అసెస్‌మెట్ నెం.372 ఆర్.సి.సి. డాబా ఇల్లు, కలప, కప్పు, దర్వాజలు, తలుపులు, కిటికిలు, యావత్తు కరెంటు వైరు ఫిటింగ్స్, బాత్‌రూం, లెట్రిన్ వగైరాలతో గల ఇంటికి **హద్దులు** : **తూర్పు** : ఆర్ అండ్ బి రోడ్, **దక్షిణం** : బోలా రామయ్య గారి ఇల్లు, **పడమర** : నరసయ్య గారి ఇల్లు, **ఉత్తరం** : గాదేరాజు అప్పారావు గారి ఇల్లు.

జి.హరేందర్ రెడ్డి
అడ్వకేట్, ఖమ్మం సెల్ :**9848022542**

మొదటిపేజీ తరువాయి

రూ.1659 కోట్లతో విఎంసి బడ్జెట్

రూ.82.10 కోట్లు (10.16 శాతం), ఇతర మార్గాల ద్వారా రూ.238.33 కోట్లు(29.48 శాతం)... ఇలా మొత్తం రూ.808.33 కోట్ల మేర ఆదాయం వస్తుందని అంచనా వేసింది. అలాగే రెవెన్యూ ఖర్చులకొచ్చేసరికి జీతాలకు రూ.246.40 కోట్లు (34.90 శాతం), నిర్వహణ ఖర్చులు రూ.279.87 కోట్లు (39.65 శాతం), రిపేర్లు, నిర్వహణ రూ.143.04 కోట్లు (20.26 శాతం), అడ్మినిస్ట్రేటివ్ ఛార్జీలు రూ.32.89 కోట్లు (4.66 శాతం), ఇతర ఖర్చులు రూ.3.74 కోట్లు (0.53శాతం)... ఇలా మొత్తం ఖర్చులు రూ.705.94 కోట్లుగా చూపారు. క్యాపిటల్ ఆదాయాల్లో కేంద్ర ప్రభుత్వం గ్రాంట్లు, కంట్రిబ్యూషన్ల రూపంలో రూ.239.48 కోట్లు (52.73 శాతం), రాష్ట్ర ప్రభుత్వ గ్రాంట్లు, కంట్రిబ్యూషన్లు రూ.214.07 కోట్లు (47.14 శాతం), ఇతర గ్రాంట్లు, కంట్రిబ్యూషన్లు రూ.0.60 కోట్లు (0.13 శాతం)గా చూపారు. క్యాప్టిల్ ఆదాయం మొత్తం రూ.454.15 కోట్లుగా అంచనా వేశారు. అలాగే క్యాప్టిల్ ఖర్చులుగా కేంద్ర ప్రభుత్వ గ్రాంట్లు, కంట్రిబ్యూషన్లు రూ.329.83 కోట్లు (47.68శాతం), రాష్ట్ర ప్రభుత్వ గ్రాంట్లు, కంట్రిబ్యూషన్లు రూ.230.35 కోట్లు (33.30 శాతం), గ్రాంట్లు, కంట్రిబ్యూషన్‌లు రూ.0.60 కోట్లు (0.09 శాతం), మున్సిపల్ సాధారణ నిధి రూ.131.00 కోట్లు (18.94 శాతం)గా ఉంది. క్యాపిటల్ ఖర్చులు మొత్తం రూ.691.78 కోట్లుగా ఉంది. గత అనుభవాల నేపథ్యంలో ఆదాయ, వ్యయాలపై విపక్ష సభ్యులు, ముఖ్యంగా సిపిఎం ఫ్లోర్‌లీడర్ సూచించిన పలు నిర్మాణాత్మక సూచనలను అధ్యక్ష స్థానంలో ఉన్న మేయర్ పరిగణలోకి తీసుకోలేదు. సమావేశం ముగింపు దశలో కనీసంగా తానిచ్చిన సవరణల తీర్మానాలను రికార్డు చేయాలని సత్యాబాబు నిరసన తెలుపుతున్నా... పలువురు సభ్యులు చేసిన సూచనలను సైతం మేయర్ పట్టించుకోలేదు. అధికారపక్షం తమ సంఖ్యాబలంతో ఏకపక్షంగా, అప్రజాస్వామిక పద్ధతిలో బడ్జెట్‌కు ఆమోదం తెలిపింది. ఎటువంటి సవరణలు లేకుండానే బడ్జెట్ ఆమోదం పొందడం గమనార్హం.

పలు సవరణలకు సిపిఎం డిసెంట్ నోట్

గాను రూ.2.41 కోట్లకు తగ్గించాలని సత్యాబాబు కోరారు. అలాగే కొండ ప్రాంతాల అభివృద్ధికి కేటాయించిన రూ. 9 కోట్ల నిధులను రూ.10 కోట్లకు పెంచాలని, వంతెనలు, ఫ్లైఓవర్లు, సబ్‌వేల నిర్మాణాలకు రూ.10 కోట్లు కేటాయించాలని, తారు రోడ్ల నిర్వహణకు రూ.3.50 కోట్లు, బరియల్ గ్రౌండ్ నిర్వహణకు రూ.85 లక్షలు, పారిశుధ్య పనిముట్లకు రూ.1.20 కోట్లు, మందుల కొనుగోలుకు రూ.25 లక్షలు, ట్రైసైకిళ్లు, పుష్‌కార్డుల నిర్వహణకు రూ.50 లక్షలు, ఆసుపత్రుల నిర్వహణకు రూ.7 లక్షలు మేర నిధులు పెంచాలని కోరారు. అలాగే క్యాపిటల్ ఖర్చుల తగ్గింపు, హెచ్చింపుల్లో... ఇతర పనులకు రూ.10.75 కోట్లకుగాను రూ.8 కోట్లకు తగ్గించాలని కోరారు. క్యాపిటల్ ఖర్చుల్లో రూ.2.75 కోట్లు మేర అదనంగా అంచనాలు పెంచాలని సత్యబాబు కోరారు. కొండ ప్రాంతాల అభివృద్ధికి రూ.2 కోట్లు సరిపోవని, ఆ పద్దు కింద మరో రూ.2 కోట్లు పెంచాలని కోరారు. ఆస్పత్రుల్లో పరికరాల కోసం రూ.10 లక్షలు, మహిళా వికాస కేంద్రాల నిర్వహణకు రూ.40 లక్షలు, దోభీఘాట్ల నిర్మాణం, నిర్వహణకు రూ.75 లక్షలు, క్రీడా పరికరాలు, జిమ్ పరికరాలకు రూ.15 లక్షలు పెంచాలన్నారు. ఎస్‌టిపిల పున:నిర్మాణ పనులకు రూ.15 లక్షల నిధులు పెంచాలన్నారు.

ఆస్తి విలువ ఆధారిత పన్నును ఉపసంహరించాలి

గత ఏడాది జూలై 10న కౌన్సిల్ చేసిన తీర్మానం ఆధారంగా ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానాన్ని ఉపసంహరించాలని మేయర్‌కు సిపిఎం ఫ్లోర్‌లీడర్ విజ్ఞప్తి చేశారు. దీనిపై తాను ఇచ్చిన డిసెంట్ నోట్‌ను రికార్డు చేయాలని కోరారు. తాము అధికారంలోకి వస్తే ఈ పన్నును రద్దు చేస్తామని ఎన్నికల ప్రణాళికలో ప్రజలకిచ్చిన వాగ్దానం ఆధారంగా తగిన చర్యలు తీసుకునేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరాలని మేయర్‌కు సత్యబాబు విజ్ఞప్తి చేశారు. అలాగే రూ.289 కోట్ల స్ట్రామ్ వాటర్ డ్రైనేజి నిధులను క్యాపిటల్ ఆదాయాలు, క్యాపిటల్ ఖర్చుల్లో అంచనాల పద్దుల కింద చూపి, ఆ పథకాన్ని పూర్తి చేసేందుకు తీర్మానించి రికార్డుల్లో నమోదు చేయాలని కోరారు.

ప్రజాబడ్జెట్ కావాలని సత్యబాబు నిరసన

ప్రజాబడ్జెట్ కావాలని సత్యబాబు డిమాండ్ చేశారు. బడ్జెట్ సమావేశానికి ముందు విఎంసి కార్యాలయ ప్రాంగణంలో బ్యానర్ చేబూని నినాదాలు చేసుకుంటూ కౌన్సిల్ హాలు వద్దకు చేరుకున్నారు. నగర ప్రజలపై పన్నుల భారాలు తగ్గించే ప్రజా బడ్జెట్ కావాలని, నగరాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పెండింగ్ గ్రాంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు

చేయాలన్నారు. రూ.20 కోట్లకు పైగా ఆస్తి పన్నుల భారం అదనంగా మోపారని పేర్కొన్నారు. ఆస్తి విలువ ఆధారిత ప్రకారం ప్రతి ఏటా 15 శాతం పన్నుల మోత నగర ప్రజలపై తప్పడం లేదన్నారు. కొండ ప్రాంతాలు, మురికివాడల అభివృద్ధి, ఆస్పత్రుల నిర్వహణకు కేటాయింపులు నామమాత్రంగా ఉన్నాయని, వీటిని పెంచాలని అన్నారు. జిజిఎంపి కింద చేసిన ఖర్చులు రూ.6 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం నుంచి అధికార వైసిపి తీసుకురాలేకపోయిందని విమర్శించారు. ఆహ్లాదం కోసం పార్కులకు వెళ్దామన్నా ప్రవేశ రుసులు అధికంగా పెంచేశారని అన్నారు. కార్మికులకు పారిశుధ్య పనిముట్లు అందుబాటులో లేకపోవడంతో నిర్వహణ అధ్వానంగా తయారైందన్నారు.

పలు పద్దులకు సవరణలు చేయాలి : సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు

సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు మాట్లాడుతూ బడ్జెట్‌ను తమ పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తోందన్నారు. ఖాళీ ఖజానా అంటూనే రూ.61 లక్షల విఎంసి నిధులు ఖర్చు చేసి కార్పొరేటర్లకు ల్యాప్‌ట్యాప్‌లు ఇవ్వాడాన్ని తప్పుబట్టారు. రూ.4 వేలు వేతనమున్న స్వీపర్లకు, వాచ్‌మెన్‌లకు వేతనాలు పెంచడానికి మాత్రం అధికార వైసిపి, ప్రభుత్వానికి చేతులు రావడం లేదన్నారు. అయినా మేయర్ వాటిని రికార్డు చేయకుండా బుట్టదాఖలు చేయడం దారుణమని పేర్కొన్నారు. రూ.289 కోట్ల స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ స్కీమ్‌కు నిధులు కేటాయింపు అంశాన్ని బడ్జెట్లో పొందుపరచలేన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి విఎంసికి రావాల్సిన వందల కోట్ల నిధులను రాబట్టడంతో అధికార వైసిపి పాలకపక్షం, ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యాయని పేర్కొన్నారు. కొండ ప్రాంతాలు, మురికివాడల అభివృద్ధికి నిధుల్లో కోత విధించారని వివరించారు. మంచినీటి సరఫరా, దోమల నివారణ, పారిశుధ్యం మెరుగుదలకు నిధులు అతి తక్కువగా కేటాయించారని విమర్శించారు. ఇందుకు నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాల నుంచి చట్టబద్ధంగా రావాల్సిన గ్రాంట్లను తీసుకురావడంలో విఫలమైన ప్రజాప్రతినిధులు... నగర ప్రజలను, వ్యాపారులను వేధిస్తున్నారని, వత్తిడి చేస్తూ అధిక పన్నులు వసూలు చేస్తున్నారని అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.350 కోట్లను తీసుకురావడంలో అధికార, ప్రధాన ప్రతిపక్షం, ప్రభుత్వం విఫలమయ్యాయని దుయ్యబట్టారు. బుడమేరు ఆధునీకీకరణ, బాధితులను ఆదుకోవడానికి నిధులు కేటాయించలేదన్నారు. వైసిపి సీనియర్ కార్పొరేటర్ బండి నాగేంద్ర పుణ్యశీల మాట్లాడుతూ బడ్జెట్ అంతా తప్పుల తడకలుగా ఉందని మండిపడ్డారు. క్యాప్యిటల్ ఆదాయ, వ్యయాల రూపంలో ఆయా పద్దుల్లో పొందుపరిచిన వాటికీ, ఆచరణరూ. రూ.300 కోట్ల నుంచి రూ.500 కోట్ల వరకు తేడా వస్తోందన్నారు. హేకర్టను పూర్తిగా విస్మరించారని పేర్కొన్నారు. విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ బకాయి పన్నులు రాబట్టేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. బుడమేరు ఆధునీకరణకు రూ.4 వేల కోట్లు ఖర్చువుతాయని ప్రభుత్వం అంచనా వేసిందన్నారు. విఎంసి బడ్జెట్లో రూ.150 కోట్లు పొందుపరిచామన్నారు.

తప్పులను సరిచేయాలి : టిడిపి సీనియర్ కార్పొరేటర్ ముమ్మనేని

టిడిపి సీనియర్ కార్పొరేటర్ ముమ్మనేని సాంబశివరావు మాట్లాడుతూ బడ్జెట్ పద్దులన్నీ తప్పుల తడకలుగా ఉన్నాయన్నారు. వాటిని సరి చేయాలని సూచించారు. టిడిపి డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్లు అడపా శేషు, మరుపిళ్ల రాజేష్, బుల్లా విజయ్‌కుమార్ బడ్జెట్‌పై మాట్లాడారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింటు అయిన శ్రీమతి మంగపట్ల సత్యవతి, భర్త వెంకటస్వామి, యన్.టి.ఆర్ జిల్లా, విజయవాడ, రామరాజ్యనగర్, కోట నాగేశ్వరరావు వీధి, నెం: 26-80ఎ వాస్తవ్యులు. వారి నంజాయిషీ తో యావన్మందికి తెలియజేయునది ఏమనగా....

ది.02-09-2024న భారీ వర్షాలు, వరదలు కారణంగా మా క్లయింటు వారి ఇల్లు నీటిలో మునిగిపోవుచున్న సమయంలో మా క్లయింటు తాలుకు ఈదిగువ ఉదహరించిన ఓరిజనల్ రిజిష్టారు దస్తావేజులను మరియు మా క్లయింట్ కుమార్తై స్టడి సర్టిఫికేట్స్ ముంపు లేని సురక్షిత ప్రాంతము నకు తరలించుసందర్భములో ఈ దిగువ తెలిపిన సర్టిఫికేట్స్ మరియు ఒరిజనల్ లింకు దస్తావేజు కనిపించకుండా పోయినవి వాటి నిమిత్తంఎంత వెదకినను మా క్లయింటుకు దొరకి యుండలేదు.సదరు దస్తావేజులు ఎవరకైన దొరకిన యెడల మా క్లయింటుకు గానీ, ఈదిగువ తెలిన అడ్రసుగాని ఫోన్ ద్వారా తెలియజేయుట గాని,లేదా పర్సనల్ గా అందజేసినచో తగిన పారితోషికం ఇవ్వబడును.అట్లు కాకమరి ఏవిధమైన అన్యాకాంతములు జిరిపిన యెడల మా క్లయింటు తీనుకోనబోవు సివిల్,క్రిమినల్ చర్యలకు భాద్యులగుదురనియు, అట్టివి మా క్లయింటును బైండ్ చేయజాలవని ఇందుమూలంగా తెలియజేయడ మైనది.

పోయిన సర్టిఫికేట్స్ మరియు దస్తావేజుల వివరాలు :-1) మా క్లయింటు కుమార్తై అయిన మంగపట్ల రాధిక కు చెందిన స్టడీ సర్టిఫికేట్స్ 1) యస్.యస్.సి వారి10వ తరగతి ఓరిజినల్ మార్క్ జాబితాసర్టిఫికేట్ నెం:121210 3576/2012, ఎ.పి బోర్డు ఆఫ్ ఇంటర్ మీడియట్ వారు ఇచ్చిన యం.ఇ.సి గ్రూప్ ఓరిజినల్ మార్క్ జాబితా సర్టిఫికేట్ నెం: 1405237414/2014, మరియు జె.ఎన్.టి.యు వారు జారీ చేసిన యం.బి.ఎ సర్టిఫికేటు నెం: 17 KTIE 0029/2019 సర్టిఫికేట్స్ పోయినవి.

2) మా క్లయింట్ ఇంటి స్థలం నకు నంబంధించిన విజయవాడ, ఇబ్రహింపట్నం, సబ్ రిజిష్టారు వారి ఇలాకా గొల్లపూడి గ్రామపంచాయితీ లోని చేరిన రీసర్వేనెం: 405/3,408/6 దాఖలా 168చ.గ.ల ఖాళీ నివేశన స్థలం, మా క్లయింటు వారి అత్త గారైన మంగపట్ల అంజమ్మ గారు ది.18-07-1991న దస్తావేజు అయిన 3721/1991ను కొల్లబత్తిన ఏసు రత్నంగారి కుమారుడు మరియన్న వ్రాయించి ఇచ్చిన ఒరిజనల్ (లింకు) దస్తావేజు (కొనుగోలు) పోయినది.సదరు అంజిమ్మగారు వ్రాసిన గిఫ్ట్ దస్తావేజు నెం: 4362/2007కుపై దస్తావేజు లింకు దస్తావేజు

ఇట్లు
టి.వి నవకుమార్ బి.కాం,. ఎల్.ఎల్.బి.,
సి.హెచ్ రమాదేవి
కె.ఆర్.రాఘువేంద్రరావు
న్యాయవాదులు
గాంధీనగర్, విజయవాడ-3,
సెల్ ఫోన్స్: 9440109153, 9246415808

విజయవాడ,
తేది.22-03-25.

మహారాజశ్రీ నందిగామ అడిషినల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S. 288/2022

Between:
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అల్లూరు...వాది
మరియు

1. మద్దినేని రామకృష్ణ S/o ఉమా మహేశ్వరరావు, వయస్సు 45 సంII లు D.No. 57-13-15/4, న్యూ P&T కాలనీ, వెస్ట్ బజార్, పటమట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ – 520010.
2. మద్దినేని హిమాదేవి,W/oఉమామహేశ్వరరావు, వయస్సు 65 సంII లు D.No. 57-13-15/4, న్యూ P&T కాలనీ, వెస్ట్ బజార్, పటమట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ – 520010.
3. ఇప్పల మహతి W/o నరసింహరావు, వయస్సు 45 సంII లు D.No. A-21, చైటపల్లి గ్రామం, వేల్పులపాడు మండలం .. ప్రతివాదులు

దావా సమనులు

పై నంబర్ దావాలో 1 మరియు 2వ ప్రతివాదులకు దావా విషయంలో ఎట్టి అభ్యంతారములన్న తెలుపుకునే నిమిత్తం ది 17/04/2025 తారీఖున పై కోర్టువారి ఎదుట వాయిదా అయి ఉన్నది సదరు వాయిదా రోజున ఉII 10:30 నిII లకు వాయిదాకు హాజరుకాని యెడల మీ పరోక్షమున దావాలో కోర్టువారు తీర్మానించెదరు.

ఇట్లు,
వేమూరు సత్యనారాయణమూర్తి,
వాది తరుపు అడ్వకేటు

నందిగామ
తేది: 23/3/25

గ్రామ పంచాయతీ కార్యాలయం – మాగల్లు

నందిగామ మండలం, ఎన్టీఆర్ జిల్లా.

ఆర్ఓసి.నెం.. తేదీ. 21.3.2025.

టెండర్ ప్రకటన

ఎన్టీఆర్ జిల్లా, నందిగామ మండలం మాగల్లు గ్రామ పంచాయతీ కార్యాలయం నందు 2025-26 సం. నకు కాంట్రాక్టు లేబర్ పద్దతి పై ఈ దిగువ తెలిపిన పనులు చేయుటకు గాను ది. 26.3.2025 వ తేదీన ఉదయం 12.00 గం. లకు సీల్డు టెండర్లు స్వీకరించ బడును. అదే రోజు మద్యాహ్నం గం. 2.00.ని.లకు టెండరుదారుల సమక్షంలో టెండర్లు తెరవబడును. పూర్తి వివరాలు ఆఫీసు పని వేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును.

కాలపరిమితి ది.01.4.2025 నుండి ది. 31.3.2026 వరకు

వ. నెం.	వివరము	ధరావత్తు
1.	పారిశుద్ధ్య పనుల నిర్వహణ.. 1-ఒకరు	రూ. 1000/-
2.	వీధి, విద్యుత్ దీపాల నిర్వహణ .1- ఒకరు	రూ. 1000/-
3.	మంచీనీటి నిర్వహణ-1 - ఒకరు	రూ.1000/-

గమనిక: 1. గతంలో గ్రామ పంచాయతీ లో పని చేసిన వారికి ప్రాధాన్యత.
2.గ్రామ పంచాయతీ నిధులు నిల్వ బట్టి వేతనాలు చెల్లింపులు చేయబడును
3.టెండర్లు నిర్వహణ లేదా రద్దు చేయుటకు గ్రామ పంచాయతీ కి పూర్తి అధికారం కలదు.
4.పైన తెలిపిన పనులే కాకుండా పంచాయతీ కి సంబంధించిన ఇతర పనులు చేయుటకు అంగీకారం తెలుపవలెను.

సంII గుంటి ఆశాజ్యోతి
సర్పంచ్, మాగల్లు

సంII కె.రవికుమార్
పంచాయతీ కార్యదర్శి, మాగల్లు

కోడూరు-బందరు మధ్య రోజుకూ నాలుగు బస్సు సర్వీసులు

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు మండల ప్రజల కోరిక మేరకు కోడూరు నుండి ఉల్లిపాలెం వారధి మీదుగా మచిలీపట్నానికి రోజుకు 4 సర్వీస్ లను కొనసాగిస్తున్నట్లు మచిలీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజు శనివారం తెలిపారు. నెలరోజుల క్రితం ప్రారంభంలో ఉదయం ఒకటి, సాయంత్రం ఒక సర్వీస్ మాత్రమే ఉండేవని, కోడూరు మండల ప్రజల అవసరాలకు తగిన విధంగా సర్వీసులను పెంచామన్నారు. కోడూరు నుంచి బందరుకు మొదటి సర్వీసు ఉదయం 7.40, రెండవ సర్వీసు ఉదయం 10.50, మూడవ సర్వీసు మధ్యాహ్నం 3.00 గంటలకు, నాలుగవ సర్వీసు సాయంత్రం 6.40 నిమిషాలకు ప్రారంభమవుతుందన్నారు.

రుద్రపాటి కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవిలో ఫౌండ్రీ వెంకటేశ్వరరావుగా అందరికీ చిరపరిచితులైన రుద్రపాక వెంకటేశ్వర్రావు ఇటీవల మరణించారు. తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా పనిచేసిన వెంకటేశ్వర్రావు మరణం పార్టీకి తీరని లోటని అవనిగడ్డ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం పెదప్రోలు శివారు కప్తాను పాలెం గ్రామంలో వెంకటేశ్వర రావు కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. వారితో పాటు తెలుగు యువత యువత మేడికొండ విజయ్, డోకిపర్తి బాలకోటేశ్వర్రావు, కేశని సురేష్ , డొకిపర్తి భరత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి-గూడూరు : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించి వున్న ఊరుకు, పాఠశాల కు పేరు తీసుకురావాలని ఆర్ఆర్ హాకీ క్లబ్ సెక్రటరీ పెనుగొండ శ్రీనివాసరావు సూచించారు. శనివారం గూడూరు మండలం గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల హాకీ ఆట నిమిత్తం విద్యార్థుల రక్షణ కోసం షిన్‌గాడ్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు,పీడీ అరుణ ,ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

స్ట్రీట్ లైట్ సర్వే నుండి మినహాయింపు ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : స్ట్రీట్ లైట్ సర్వే నుండి వార్డు సచివాలయ కార్యదర్శులకు మినహా యింపు ఇవ్వాలని కోరుతూ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కృష్ణాజిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ కమిషనర్ బాపి రాజు ను కలసి విజ్ఞప్తి చేశారు. వార్డ్ అమినిటీ సెక్రటరీస్ కి రాత్రి వేళలో పోల్ టు పోల్ స్ట్రీట్ లైట్ సర్వే చేయమని ఏఈ ఇచ్చిన ఉత్తర్వుల వల్ల వార్డ్ అమీనిటీస్ సెక్రెటరీ అందరూ కూడా ఇబ్బందులు పడుతున్నారని ,ఇప్పటికే అనేక సర్వేలతో వార్డు సచివాలయల కార్యదర్శులు, సిబ్బంది తీవ్ర మానసిక ఒత్తిడికి గురి అవుతున్నారని కాబట్టి స్ట్రీట్ లైట్ సర్వే నుండి కార్యదర్శులకు మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కమిషనర్ ను కలసిన వారిలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కృష్ణా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి. రాము, తోట ప్రసాద్,శ్రీనివాస్ రావులు ఉన్నారు.

జగనన్న కాలనీలో సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి-కంకిపాడు : పెనమలూరు మండలం వణుకూరు గ్రామంలోని జగనన్న కాలనీలలో రోడ్లు, డ్రైన్లు, మంచినీళ్లు, వీధిలైట్లు లేక స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, సమస్యలు పరిష్కరించాలని సిపిఎం పెనమలూరు మండలం కార్యదర్శి షేక్ ఖాసిం డిమాండ్ చేశారు. ప్రజాచైతన్య యాత్రలో వచ్చిన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి 9 నెలలు అవు తున్నా జగనన్న కాలనీల వైపు కన్నెత్తి చూడలేదన్నారు. స్థానిక ప్రజలు అధికారులను ప్రజాప్రతినిధులను అనేకసార్లు కలిసినా న్యాయం చేస్తామని మాటలేగానీ సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సిపిఎం ప్రజలకు అండగా ఉంటుందన్నారు. అనంతరం సమస్యలపై తహసీల్దార్, ఎంపిడిఒ, పంచాయతీ కార్య దర్శికి వినతిపత్రాలు అందించారు. సిపిఎం నాయకులు ఉప్పాడ త్రిమూర్తులు, సిపిఎం వణుకురు శాఖ కార్యదర్శి జోజిబాబు, పెనమలూరు మహిళా సంఘం పెనమ లూరు మండల అధ్యక్షులు షేక్ కొలీమా, వెంకటేశ్వ రరావు, ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న దృశ్యం

హైకోర్టు న్యాయమూర్తికి స్వాగతం

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్టు పోలియో న్యాయమూర్తి రవినాథ్ తిలహరి శనివారం కృష్ణా జిల్లా కేంద్రమైన మచిలీపట్నం వచ్చా రు. బెల్ అతిథి గృహం చేరుకున్న రవినాథ్ తిలహరిని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా పోలీసు అధికారి ఆర్ గంగాధర్‌రావు, ఆర్డిఓ స్వాతి సాదర పూర్వకంగా స్వాగతం పలికి మర్యాదపూర్వకంగా మొక్కలు అంద జేశారు. ఈ సందర్భంగా మచిలీపట్నం న్యాయస్థానాల ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సిహెచ్ వి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఏ వేణు ఆఫీస్ బేరర్లు మర్యాద పూర్వకంగా హైకోర్టు న్యాయమూర్తిని కలిసి తమ సంఘానికి విజయవాడలో సమావేశాలు నిర్వహించు కోవడా నికి ఒక భవనం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కోర్టు న్యాయమూర్తులు చిన్నంశెట్టి రాజు, డి ఎల్ ఎస్ ఏ కార్యదర్శి కె.వి రామకృష్ణయ్య, విజయవాడ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఏ సత్యానంద్ పాల్గొన్నారు.

31లోగా ఇకెవైసి చేయించుకోవాలి : తహశీల్దార్

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలో 3244 రేషన్ కార్డు లబ్ధిదారులు ఇకేవైసీ చేయించుకోవాల్సి ఉందని మండల తాసిల్దార్ బి లోకరాజు శనివారం తెలిపారు. ఈకేవైసీ చేయించుకోవాల్సిన లబ్ధిదారులు తమ వేలిముద్రల ద్వారా ఇపాస్ మిషన్ లో ఈ కేవైసీ నమోదు ఈనెల 31వ తేదీ లోపు చేయించుకోవాలని సూచించారు. దగ్గర్లోనే సచివాలయంలో గాని, రేషన్ డీలర్ వద్ద గాని ఈ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శివకుమార్, వీఆర్వో ప్రకాష్, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

విద్యతో ఉన్నత శిఖరాలకు చేరొచ్చు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-అవనిగడ్డ : సమాజంలో ప్రతిఒక్కరు విద్యను అభ్యసించడం ద్వారానే పురోగమనం సాధించగలు గుతారని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ సూచించారు. అవనిగడ్డలోని ప్రభుత్వ డిగ్రీ కళా శాల 48వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు నిరం తరం జ్ఞానసముపార్జన చేయడం ద్వారా గొప్పవారుగా ఎదుగుతారని, అందుకు కృషి పట్టుదల క్రమశిక్షణ అవసరమన్నారు. నేడు అధునాతన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. భారత దేశ రక్షణ పరిశోధన రంగంలో ఉన్నత స్థాయికి చేరుకున్న డాక్టర్ సతీష్ రెడ్డి లాంటి శాస్త్రవేత్తలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. తమ కళాశాలలో పరిశోధనలతో డాక్టరేట్లు పొందిన ప్రొఫెసర్లను ఆదర్శంగా తీసుకొని విద్యార్థుల సైతం పరిశోధనా రంగంపై దృష్టి సారించాలన్నారు. కేవలం చదువులోనే కాక తమకు అందుబాటులో ఉన్న క్రీడా ప్రాంగణాన్ని సద్వినియోగం చేసుకొని ఆటలలో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనే విధంగా ఎదగాలన్నారు.అనంతరం కళాశాలలో బెస్ట్ విద్యార్థిగా ఎంపికైన ఆశాలతను జ్ఞాపకతో సత్కరించి బహుమతి అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి ఉమారాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతి దేవి, గ్రామ సర్పంచ్ గోరు ముచ్చు ఉమా, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు తోట శ్యామ్ కిషోర్ నాయుడు, మతి శ్రీనివాసరావు, బంటుమల్లి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ జగన్ మోహన్‌రావు పాల్గొన్నారు

మాట్లాడుతున్న మండలి బుద్ధప్రసాద్

వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ ఎస్పీ వివి నాయుడు

బాలికపై అత్యాచారం కేసులో మరో నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం వీరపనేని గూడెంలో జరిగిన బాలికపై అత్యాచారం కేసులో మరో నలుగురిని అరెస్ట్ చేసినట్లు కృష్ణాజిల్లా అడిషనల్ ఎస్పీ వి. వి నాయుడు తెలిపారు. శనివారం గన్నవరం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 13 నుండి అదృశ్యమైన బాలిక కొంతమంది నేరగాళ్లకు చిక్కి అత్యాచారానికి గురైన విషయం విదితమే అన్నారు. మొత్తం ఎనిమిది మంది ఈ నేరంలో పాలుపంచుకోగా ఇప్పటికే ఇద్దరిని అరెస్టు చేసి జైలుకు పంపారని, ఇప్పుడు మరో నలుగురిని అరెస్టు చేశామన్నారు. వారిలో కేసరపల్లికి చెందిన కొండేటి అనిల్, వీరపనేనిగూడెంకు చెందిన ఉయ్యూరు నవీన్ కుమార్, పరసా సంజయ్ వర్ధన్, పరసా రాజేష్ ఉన్నారని చెప్పారు. మరో ఇద్దరు మైనర్లుగా ఉండగా వారిని బాల నేరస్తుల శిక్షణాలయానికి పంపించామన్నారు. వీరు చిన్న వయసులోనే వ్యసనాలకు బానిసలై, దారి తప్పిన నడవడికతో సంఘవ్యతిరేక శక్తులుగా వాళ్ళు మారినట్లు చెప్పారు. కృష్ణాజిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్ రావు ఆధ్వర్యంలో ఈ కేసు దర్యాప్తును వేగవంతంగా చేపట్టి నిందితులను అరెస్టు చేశామన్నారు. ఈ కేసులో విశేష ప్రతిభ కనబరిచిన గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివా సరావు, హనుమాన్ జంక్షన్ సీఐ శ్రీ కేవీవీ ఎన్ సత్యనారాయణ, ఆత్కూరు ఎస్సై చావా సురేష్ మరియు సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి మండలం పెదప్రోలు గ్రామ పంచాయతీ పరిధిలోని కాసానగరం జాతీయ రహదారిపై శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. కాసానగరం వద్ద రోడ్డు దాటుతున్న మోపిదేవి మండలం కే కొత్తపాలెం గ్రామంకు చెందిన కొక్కిలిగడ్డ ఏసోబును బైక్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు పాలయ్యాడు. బైక్ అతి వేగంగా నడపడమే ప్రమాదానికి కారణమని స్థానికులు చెప్పున్నారు. ఏసోబును 108 వాహనంలో మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలని వినతి

ప్రజాశక్తి-ఉయ్యూరు : గ్రామపంచాయతీ కార్మికు లకు కనీస వేతనాలు అమలు చేయాలని సిఐటియూ నాయ కులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంచాయతీల్లో వివిధ పనులు చేస్తున్న కార్మికుల కు కనీసవేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, అమలుచేయాలని, లైనర్ అలవెన్సులు చెల్లించాల ని కోరుతూ సిఐటియూ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూ నియన్ నాయకులు శనివారం గండిగుంట, చినఓగిరాల, కాటూరు, కలవపాముల గ్రామపంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రాలు అందచేశారు. సిఐటియూ నాయకులు బాలగంగాధర్, బి రాజేశ్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మేధో సంపత్తిపై అవగాహన

ప్రజాశక్తి-మొవ్వ : వియస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో మేధో సంపత్తి హక్కులపై వెబ్‌నార్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్, కోఆర్డినేటర్ మంజుల అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సుస్మిత రాహుల్ భట్నాసి పాల్గొని మాట్లాడుతూ వ్యక్తి మానవ మేధస్సు ఉత్పత్తిని రక్షించడానికి జాగ్రత్త వహించడానికి చట్టపరమైన భద్రత అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి-మోపిదేవి : మండల కేంద్రమైన మోపిదేవిలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని శనివారం హైకోర్టు న్యాయమూర్తి, కృష్ణా జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ రవినాథ్ తిల్హారి దర్శించుకున్నారు. జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం దేవస్థానానికి వచ్చిన న్యాయమూర్తి దంపతులను ఆలయ కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో ఆలయ వేద పండితులు ఘన స్వాగతం పలికారు. తిల్హారి దంపతులు ఆలయ ఆవరణలో గల నాగపుట్టలో పాలు పోసి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామి వారిని దర్శించుకోగా, ఆలయ వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రవినాథ్ తిల్హారి దంపతులకు ఆలయ కార్య నిర్వహణాధికారి జ్ఞాపికగా స్వామివారి చిత్రపటాన్ని పెద్ద ప్రసాదాలను అందజేసి, ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి అరుణ సారిక, మచిలీపట్నం ఫస్ట్ అడిషనల్ జడ్జి చిన్నంశెట్టి రాజు, అవనిగడ్డ సబ్ జడ్జి షరీఫ్, మొవ్వ కోర్టు జడ్జి రాజన్ ఉదయ్ ప్రకాష్, డిఎస్పి తాళ్లూరి విద్యశ్రీ, సీఐ ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : తోట్ల వల్లూరులో కమ్యూనిటీ హాల్ షాది ఖానా నిర్మించి ముస్లింలకు కానుకగా అందిస్తామని పామర్రు నియోజకవర్గ ఎమ్మెల్యే కుమార్ రాజా తెలిపారు. శనివారం రాత్రి ముస్లిం మైనారిటీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎం. ఎం. దౌలా,షేక్ సలాం ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో కుమార్ రాజా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొట్టిపాటి శివరామకృష్ణ, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి మాజీ జిల్లా తెలుగు యువత నాయకులు రామినేని వెంకట కుటుంబ నరసింహా రావు, వల్లూరు కిరణ్, చింతపల్లి వెంకటేశ్వరరావులు మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' చిత్ర యూనిట్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయవాడ నగరంలో అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి చిత్ర యూనిట్ సందడి చేసింది. ఏప్రిల్ 11న అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి చిత్రం విడుదల కానుందని, అన్ని వర్గాల ప్రేక్షకులను ఈ చిత్రం ఆకట్టుకుంటుందని చిత్ర కథానాయకుడు ప్రదీప్ మాచిరాజు చెప్పారు. శనివారం దుర్గమ్మ సన్నిధి నుంచి తమ చిత్ర ప్రమోషన్ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి చిత్రం ప్రమోషన్ లో భాగంగా హీరో ప్రదీప్, హీరోయిన్ దీపిక విజయవాడ ఇంద్ర కీలాద్రిపై కొలువైయున్న శ్రీ కనక దుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం దేవస్థాన పండితులు దుర్గమ్మ ప్రసాదం చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం హీరో ప్రదీప్ మాచిరాజు మాట్లాడుతూ... ఏప్రిల్ 11న అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి చిత్రం విడుదల కానుందన్నారు. అనంతరం హీరోయిన్ దీపిక మాట్లాడుతూ హీరో ప్రదీప్‌తో కలిసి ఈ చిత్రంలో నటించడం సంతోషంగా ఉందన్నారు.

ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : స్థానిక 38వ డివిజన్ కుమ్మరిపాలెం సెంటర్ వద్ద గల తాజ్ మస్జీద్ వద్ద వైసిపి రాష్ట్ర నాయకులు షేక్ హయత్ ఆధ్వర్యంలో శనివారం నాడు పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ విందులో ముస్లిం సోదరులు, వైసిపి నాయకులతో కలిసి మాజీ మంత్రివర్యులు, విజయవాడ పశ్చిమ వైసిపి ఇన్చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొని ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. 41వ డివిజన్ కార్పొరేటర్ షేక్ ఇర్ఫాన్, వైసిపి నాయకులు నజీర్, మహ్మద్ గౌసి, ఇర్ఫాన్, గౌస్ బాషా, ఫారూక్, రవూఫ్, పాల్గొన్నారు.

మఠం శివాలయం పునర్నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణ సమీపంలోని పాలేటివొడ్డున గల శివ పంచాయతన క్షేత్రం మఠం శివాలయం పునర్నిర్మాణానికి యాత్రికుల నోముల వెంకటేశ్వరరావు, మంగతాయారు సంయు క్తంగా ఆలయ కమిటీ సభ్యులకు 25,116/ విరాళంగా అందచేశారు.

వివేకానంద విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - మైలవరం : ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ ఒలంపియాడ్‌లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బండి రామారావు ఆధ్వర్యంలో నడపబడుతున్న స్థానిక వివేకానంద ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్‌లు శ్రీనివాసరావు, పి.రాజారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల యూనిఫైడ్ కౌన్సిల్ వారు నిర్వహించిన నేషనల్ లెవెల్‌లో 100 లోపు ర్యాంకులు తమ విద్యార్థులైన లక్ష్మీ ప్రణీత, ఎస్.ప్రశాంతి, శివప్రియ, అనువర్శిని, మధు శ్రీ, ఎం.మధు, ఉమా సాయి కృష్ణ, సాత్విక, శ్రీ కిరణ్, శరణ్య, హర్షిత, జస్మిత, సూర్య వర్ధన్ రెడ్డి, ప్రణత్, అద్విక్ ప్రసూన్లు వందలోపు ర్యాంకులు సాధించారన్నారు.

ఉగాది పురస్కారానికి ఎఎస్ఐ లక్ష్మణస్వామి ఎంపిక

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జగ్గయ్యపేట పట్టణ డిఎస్‌బి యూనిట్‌లో పనిచేస్తున్న అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ యలవర్తి లక్ష్మణ స్వామికి ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 'ఉత్తమ సేవా పథకం' అవార్డుకు ఎంపిక చేసింది. ఈ అవార్డును అధికారికంగా ప్రకటించింది. ఆయన స్వస్థలం కృష్ణా జిల్లా కలిదిండి గ్రామం. యలవర్తి లక్ష్మణ స్వామి ఈ పురస్కారాన్ని ఉగాది సందర్భంగా స్వీకరించనున్నారు. మంచితనం, కలుపుగోలుతనం, వృత్తిలో అంకితభావంతో ప్రసిద్ధులైన ఆయన, ప్రజలతో పాటు పోలీస్ శాఖలో సహచరులకూ ఆదర్శంగా నిలిచారు. ఆయన విధి పట్ల చూపిన నిబద్ధత, న్యాయపరమైన తపన ఆయనను పోలీస్ వ్యవస్థలో రోల్ మోడల్‌గా నిలబెట్టింది. అనేకమంది అభిమానుల్ని చేసింది. సంచలనాత్మక ఆయేషా మీరా హత్యకేసు ఛేదనలో ఆయన కీలకంగా వ్యవహరించారు. ఈ గౌరవానికి ఎంపిక కావడం పట్ల స్థానికులు, అధికారులు, శ్రేయోభిలాషులు ఆనందం వ్యక్తం చేశారు.

ఇళ్ల నిర్మాణానికి అనుమతివ్వాలి: సిపిఎం

విజయవాడ రూరల్ : పి.నైనవరం ఆర్ అండ్ బి రోడ్డుకు ఉత్తరంగా ఉన్న భూమిని ఇల్లు నిర్మించుకునేందుకు అనుమతివ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోట కళ్యాణ్, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాల కోసం పి.నైనవరం గ్రామంలో మూడో రోజు కంపలు, తుప్పలు పెద్ద పెద్ద ముళ్ళ పొదలను, మోడులను తొలగించారు. ఈ మేరకు శనివారం వారు మాట్లాడుతూ పి.నైనవరం గ్రామానికి చెందిన పేదలైన ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ తరగతుల వారికి గత ప్రభుత్వం జగనన్న కాలనీల పేరుతో 286 మందికి పాతపాడు గ్రామ పరిధిలో ఇచ్చింది. వారి ఊరికి 10 కిలోమీటర్లు దూరంగా ఉన్నందున అక్కడికి ఎవరు వెళ్లలేదని, మార్గం కూడా లేక నిర్మాణాలు చేపట్టలేదని చెప్పారు. గ్రామ పరిధిలో ఇళ్లస్థలాలు ఇవ్వాలని వారు కోరుతున్నారన్నారు. ఈ విషయాన్ని గతంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చామని గుర్తు చేశారు. తమ గ్రామ పరిధిలోనే ఆర్ఎస్ నెంబర్ 50/1ఎల్పీ నంబర్ 16 చెరువు స్వభావాన్ని అడంగల్‌లో ఉందని, అయితే అది నివాసయోగ్యమైనది కాదని వారు తెలిపారు. ఆర్ అండ్ బి రోడ్డు నున్న నుండి అంబాపురం రోడ్డు చెరువు మధ్యలో పూర్వకాలం నుండి రోడ్డు ఉందని, రోడ్డుకు ఉత్తరంగా ఉన్న ఖాళీ స్థలంలో గతంలో కొందరు ఆక్రమించుకున్నారని గుర్తు

ముళ్ల కంపలు తొలగిస్తున్న దృశ్యం

చేశారు. ఇళ్ల స్థలాల లబ్దిదారులు రోజువారి వ్యవసాయ కూలీ పనులు చేసుకునే కూలీలు ఇంటి అద్దెలు కట్టుకోలేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్ఎస్ నెంబర్ 50/1 లో ఉన్న భూమి ప్రభుత్వ అడంగల్‌లో చెరువు స్వభావం కలిగిన భూమిని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇళ్ళ స్థలాల పోరాట కమిటీ సభ్యులు కళావతి, జమున విజయమ్మ, రమణ, చీదిరాల.లక్ష్మి, దుర్గా, గంగాభవాని కనకమహాలక్ష్మి, దావు శ్రీనివాసరావు, కృష్ణవేణి,భాజీ, సట్టు. శ్రీనివాసరావు మొదుగు.సురేష్ బాబు, అజేయ్, సిపిఎం విజయవాడ రూరల్ మండలం కార్యదర్శి మాతంగి ఆంజనేయులు, రంగారెడ్డి, దుర్గరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రావెల్ ఎగ్జిబిషన్‌కు స్పందన

పజాశక్తి - ఎడ్యుకేషన్ : జాతీయ, అంతర్జాతీయ పర్యాటకాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా విజయవాడలో ఏర్పాటు చేసిన రెండు రోజుల ఎగ్జిబిషన్ ఘనంగా ప్రారంభమైంది. తొలిరోజైన శనివారం సందర్శకుల తాకిడితో ప్రదర్శన నిండిపోయింది. పెద్ద సంఖ్యలో వచ్చిన సందర్శకులు, పర్యాటక ప్రియులు ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆసక్తిగా తిలకించారు. దేశీయ పర్యాటక ప్యాకేజీలతోపాటు అంతర్జాతీయ టూర్లకు సంబంధించిన వివరాలను పలువురు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇండియన్ ఇంటర్నేషనల్ ట్రావెల్ ఎగ్జిబిషన్ (ఐఐటీఈ) డైరెక్టర్ అనురాగ్ గుప్తా మాట్లాడుతూ విజయవాడలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌కు తొలిరోజే ఊహించని స్పందన వచ్చిందని తెలిపారు. ప్రదర్శనలో అత్యుత్తమ టూర్ ప్యాకేజీలు, దేశవిదేశీ పర్యటనల గురించి సందర్శకులు ఎంతో ఆసక్తి కనబరుస్తున్నారని అన్నారు. విజయవాడ బందర్ రోడ్‌లోని రాఘవయ్య పార్క్ సమీపంలోని విజయ కృష్ణ సూపర్ బజార్‌పైన ఉన్న అమరావతి కన్వెన్షన్‌లో ఆదివారం కూడా 11.30 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు ప్రదర్శన ఉంటుందన్నారు. భారతదేశంలో ప్రీమియర్ ట్రావెల్ అండ్ టూరిజం ఎగ్జిబిషన్ ఇదని చెప్పారు.

ఐఐటీఈ అనేది ట్రావెల్, టూరిజం, రైల్వేలు, హాస్పిటాలిటీ, అనుబంధ పరిశ్రమల్లో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి ప్రదర్శిస్తుందని వివరించారు. ఈ ట్రావెల్ ఎగ్జిబిషన్ దేశీయ, అంతర్జాతీయ పర్యాటక గమ్యస్థానాలు, హోటళ్ళు, రిసార్ట్‌లు, అనుబంధ సేవలు, దేశ విదేశీ టూర్ ఆపరేటర్ల వివరాలు అందిస్తుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ టూరిజంతో పాటు మధ్యప్రదేశ్ టూరిజం తదితర రాష్ట్ర పర్యాటక సంస్థలనూ ప్రదర్శిస్తుందన్నారు. దేశీయంగా కూర్గ్‌లోని అత్యంత విలాసవంతమైన రిసార్ట్‌లలో ఒకటైన కర్ణాటక టింబర్ టేల్స్, ఇతర ప్రముఖ ప్రాంతాలనూ చూపిస్తుంది. దేశ, విదేశాల్లోని పర్యాటక ప్రాంతాలకు ప్యాకేజీలను అందించే అనేక ట్రావెల్ ఏజెన్సీలు, హోటళ్ళు, రిసార్ట్‌ల వివరాలను వివరిస్తుందని ఐఐటీఈ డైరెక్టర్

ప్యాకేజీల వివరాలు తెలుపుతున్న నిర్వాహకులు

అనురాగ్ గుప్తా వివరించారు. తమ ప్రదర్శనలో అడ్వెంచర్, హనీమూన్, స్పోర్ట్స్ అండ్ వెల్నెస్, క్రూయిజ్‌లు అండ్ సఫారీలు, ఎంఐసిఇ, డెస్టినేషన్ వెడ్డింగ్‌లు, తదితర ప్రత్యేక ప్యాకేజీలు కూడా ఉన్నాయన్నారు. ఎగ్జిబిషన్లో స్టాళ్లు ఏర్పాటు చేసిన వారు తాము అందించే గమ్యస్థానాలు, హెూటళ్ళు, వసతి, ట్రావెల్, టూర్ ప్యాకేజీలు, ఇతర సేవల గురించిన సమగ్ర సమాచారాన్ని వివరిస్తారని తెలిపారు. దేశీయంగా మధ్యప్రదేశ్, అండమాన్, కర్ణాటక, తమిళనాడు, ఒడిశా, తదితర ప్రాంతాలతోపాటు అంతర్జాతీయ స్థాయిలో దుబాయ్, సింగపూర్, మలేషియా, బాలి, నేపాల్, భూటాన్, స్కాండినేవియా, మరెన్నో దేశాల్లో అద్భుత పర్యాటక ప్రాంతాల అనుభూతులను అందిస్తారని వివరించారు. రాబోయే కాలంలో పర్యాటకుల తాకిడి పెరుగుతుందని, పర్యాటకాన్ని ప్రోత్సహించడంలో విజయవాడ కీలక పాత్ర పోషిస్తుందని అంచనా వేస్తున్నామన్నారు. విజయవాడ, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలలో పర్యాటకాసక్తిని పెంపొందించడం, వారి సెలవుల్లో అత్యుత్తమ పర్యాటక అనుభవాలను అందించడం తమ ప్రధాన లక్ష్యమని వివరించారు. ప్రయాణికులు గమ్యస్థానాన్ని ఎంచుకోవడానికి వన్ స్టాప్ షాపుగా ఈ ప్రదర్శన ఉంటుందన్నారు. సందర్శకులకు ఈ ప్రదర్శన ప్రవేశం పూర్తిగా ఉచితమని, పర్యాటక ప్రియులే కాకుండా నగర వాసులంతా సందర్శించాలని ఐఐటీఈ డైరెక్టర్ అనురాగ్ గుప్తా ఆహ్వానించారు.

29న చిరువ్యాపారుల ధర్నాను విజయవంతం చేయాలి: సిఐటియు

ప్రజాశక్తి - విజయవాడ : చిరు వ్యాపారాల రక్షణ, ప్రజాప్రతినిధుల వైఖరికి నిరసనగా ఈ నెల 29న ధర్నా చౌక్‌లో నిర్వహించే ధర్నాలో పెద్ద ఎత్తున చిరు వ్యాపారులు పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు సెంట్రల్ సిటీ కమిటీ అధ్యక్షులు కె.దుర్గారావు పిలుపునిచ్చారు. శనివారం గవర్నర్ పేటలోని శ్రీశ్రీ భవన్లో నగరంలోని చిరు వ్యాపారుల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ పోరాటాల ద్వారానే చిరు వ్యాపారాలను కాపాడుకోవాలని కోరారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే చిరు వ్యాపారస్తులకు రక్షణ కల్పిస్తామని చెప్పి నేడు వ్యాపారస్తుల జీవనోపాధి దెబ్బతీసే విధంగా వ్యవహరించటం సరైంది కాదని మండిపడ్డారు. విజయవాడ నగరంలో ఉన్న అందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, అధికార పార్టీ నాయకుల దౌర్జన్యాల ఆపాలని కోరుతూ ఈనెల 29న అలంకార్ ధర్నా చౌక్ వద్ద జరిగే మహా ధర్నాలో చిరు వ్యాపారస్తులందరూ

మాట్లాడుతున్న దుర్గారావు

పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సి.ఐ.టి.యు సెంట్రల్ సిటీ కోశాధికారి వై.సుబ్బారావు, విజయవాడ హాకర్స్, తోపుడుబండ్ల యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు బెవరా వెంకటేశ్వరరావు (భూలోకం) సి.హెచ్ మురళి, నగర నాయకులు బాల బొమ్మ లక్ష్మణ, బెవర శ్రీను, పి.సాంబిరెడ్డి,కె.గోపి, ఎస్.కె. మస్తాన్, అబ్దుల్లా, రాణిలతోపాటు నగరంలోని వివిధ ప్రాంతాల చిరు వ్యాపారస్తులు పాల్గొన్నారు.

మజ్జిగ, పులిహోర పంపిణీ

ప్రజాశక్తి - మైలవరం : ఆశ్రయ రెడ్డి (యూఎస్ఏ) జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని వెల్వడం శ్రీమతి లక్కిరెడ్డి పాపులమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1987 నుండి 92 వరకు చదివిన పూర్వ విద్యార్థుల సంఘం సహకారంతో శనివారం వెల్వడం మెయిన్ సెంటర్‌లో నిర్వహిస్తున్న చలివేంద్రం వద్ద మజ్జిగ, పులిహార పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్కిరెడ్డి పుల్లారెడ్డి కేక్ కట్ చేసి మజ్జిగ పంపిణీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పూర్వ విద్యార్థులందరూ కలిసి ఒక సంఘంగా ఏర్పడి వేసవిలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి సంఘం నాయకులు గూడూరు నాగిరెడ్డి, అంబటి కేశవరావు, ఆనం వెంకటేశ్వరరావు వేముల సూరయ్య, కుడుముల హనుమ రెడ్డి, విజయ్ కృష్ణ సుధీర్ దంపతులు పాల్గొన్నారు.

విశ్వ భారతి కళాశాలలో ఫేర్‌వెల్

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : విశ్వ భారతి డిగ్రీ కళాశాల ఫేర్‌వెల్ పార్టీ పట్టణంలోని కొత్త వెంకటేశ్వర స్వామి వారి కల్యాణ మండపంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధ్యక్షులు నెట్టెం శ్రీ రఘురామ్, శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చదువులో గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థిలకు గోల్డ్ మెడలు అందజేసి వారిని అభినందించారు.

తిరుమలగిరికి పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని తిరుమలగిరి గ్రామంలో గల శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం యాత్రికులు పోటెత్తారు. ఫాల్గుణ మాసం ఆఖరి శనివారం అవ్వడంతో చుట్టు పక్కల యాత్రికులే కాకుండా ఇతర జిల్లాలు, తెలంగాణ రాష్ట్రం నుంచి సైతం యాత్రికులు స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. యాత్రికులు వారు పండించిన పంటలలో ధాన్యాన్ని, పాలను పలు పంటల దిగుబడులను స్వామి వారికి మొక్కుబడులుగా అందించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి ఏర్పాట్లు పర్యవేక్షించారు. యాత్రికులకు అన్నసమారాదన ఏర్పాటు చేశారు.

పాఠశాలకు టేబుల్ బహూకరణ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : చదువుకున్న పాఠశాలకు 1974-75 పదో తరగతి విద్యార్థుల సహకారంతో సుమారు 18వేలు విలువగల టేబుల్‌ను శనివారం పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు హనుమంత రావుకు అందించారు. ఈ కార్యక్రమంలో వీరవల్లి శ్రీనివాసరావు, మొరిశెట్టి రంగారావు, మేకా శ్రీనివాసరావు, నాగంళ్ళ వెంకట రాజారావు తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీ పరిశీలన

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండలం అంబారుపేట గ్రామం వద్ద నందిగామ కు మంచినీరు సరఫరా చేసే ప్రధాన లైను అంబారుపేట గ్రామం వద్ద లీకేజీ అయింది. లీకేజీ కారణంగా నందిగామ కు మంచినీటి సరఫరాకు ఇబ్బంది ఎదురయింది. తక్షణమే ఆ ప్రాంతాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కష్ణకుమారి శనివారం పరిశీలించారు. మరమ్మత్తు కార్యక్రమాల్ని త్వరగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

ఘనంగా ఉషారామా కళాశాల 17వ వార్షికోత్సవం

ప్రజాశక్తి-ఉంగుటూరు : ప్రస్తుతం విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు విద్యను అభ్యసించ గలిగితేనే ఉన్నత శిఖరాలను అధిరోహించ గలుగుతారని సాఫ్ట్వేర్ అప్లికేషన్స్ ఒరాకిల్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ కె విశ్వప్రసాద్ అన్నారు. మండలంలోని ఉషా రామా ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల 17వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కె విశ్వప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు మీరు ఎంచుకున్న కోర్సులలో ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను పెంపొందించుకోవాలని, సబ్జెక్టుపై పట్టు సాధించాలని, అప్పుడే వారి రంగాలలో అభివృద్ధి సాధించగలుగుతారని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవికెఎస్ వి ప్రసాద్ కళాశాల వార్షిక నివేదిక ను చదివి వినిపించారు. అనంతరం కళాశాల అకాడమిక్‌లో టాపర్స్ గా నిలిచిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, సిల్వర్ మెడల్స్ అందించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ సుంకర రామబ్రహ్మం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందిస్తున్న దృశ్యం

అగ్నిప్రమాద బాధితులకు చేయూత

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం బైపాస్ రోడ్డు సమీపంలో మార్చి ఆరో తారీఖున జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన మూడు కుటుంబాలకు శనివారం లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ కన్వీనర్ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ శనివారం చేయూత అందించారు. బాధిత కుటుంబాలకు 20 వేల రూపాయలు ఖరీదు చేసే బట్టలు, నిత్యవసర వస్తువులు, వంట సామగ్రిని మూడు వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన మూడు పేద కుటుంబాలకు ప్రభుత్వ పరంగా పక్కా ఇల్లు నిర్మించి ఆదుకోవాలని జిల్లా కలెక్టర్కు బాలాజీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అడపా మురళి, న్యాయవాది కమ్మిలి విజయ కుమార్, కొమిరిపాలెం శ్రీనివాస్ శీను పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా ఉపసర్పంచ్ ఎన్నికలు

- జిల్లా పంచాయతీ అధికారి జె.అరుణ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ఈ నెల 27న జిల్లాల్లో జరగనున్న పంచాయితీ ఉప సర్పంచ్ ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి జె.అరుణ సూచించారు. ఉప సర్పంచ్ ఎన్నికల నిర్వహణపై జిల్లా పంచాయతీ అధికారి శనివారం కలక్టరేట్ సమావేశ హాలులో ప్రిసైడింగ్ అధికారులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు .ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి అరుణ మాట్లాడుతూవి జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో ఖాళీగా ఉన్న 13 ఉప సర్పంచ్ పదవులకు ఈ నెల 27న ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. వార్డు సభ్యుల ద్వారా జరిగే ఈ ఎన్నికల కోసం 27న ఉదయం 11 గంటలకు ఆయా పంచాయతీల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కాబట్టి ఎన్నికలు నిర్వహణలో ఎలాంటి ఆరోపణలకు తావివ్వకుండా నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు కషి చేయాలని ఆదేశించారు. విధుల్లో పాల్గొనే అధికారులకు వచ్చిన పలు సందేహాలను ఈ సందర్భంగా ఆమె నివత్తి చేశారు. కార్యక్రమంలో డివిజన్ పంచాయతీ అధికారులు, మండల విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పంచాయతీ అధికారి జె. అరుణ

బెల్ సేవలు అభినందనీయం : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : భారత్ ఎలక్ట్రానిక్ లిమిటెడ్ సంస్థ సేవ కార్యక్రమాలు అభినందనియం అని జిల్లా కలెక్టర్ డి కె బాలాజీ అన్నారు. మచిలీపట్నం భారత్ ఎలక్ట్రానిక్ లిమిటెడ్ కార్యాలయంలో శనివారం దివ్యాంగులకు ఎలక్ట్రానిక్ ట్రై సైకిల్లు పంపిణీ కార్యక్రమం కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, బెల్ డైరెక్టర్ దామోదర్ బట్టడ చేతుల మీదుగా ప్రారంభించి పంపిణీ చేశారు .ఉమ్మడి కష్ణాజిల్లాలో 300 ట్రైసైకిళ్లను పంపిణీ చేసేందుకు బెల్ సంస్థ కార్యక్రమం చేపట్టింది. దానిలోని భాగంగా శనివారం ఈ కార్యక్రమం లాంఛనంగా చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ సామాజిక బాధ్యత లో భాగంగా ఇలాంటి కార్యక్రమం చేపట్టి మంచి నాణ్యత గల ఎలక్ట్రానిక్ ట్రైసైకిళ్ళ హెల్మెట్ ఇవ్వటం ద్వారా దివ్యాంగుల ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం డైరెక్టర్ దామోదర్ భట్టాడ ను కలెక్టర్ ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో వివిధ ఈ భాగాలకు సంబంధించిన జనరల్ మేనేజర్లు జీతేంద్ర సింగ్, ఇంద్రజిత్ సింగ్, రమ మేడం, ఉద్యోగులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు

ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కంకిపాడు : లయన్స్ క్లబ్ కంకిపాడు, హ్యాపీ దంత వైద్యశాల ఆధ్వర్యంలో స్థానిక స్మైల్ లైఫ్ కేర్ హాస్పిటల్ లో మెగా వైద్యశిబిరాను నిర్వహించారు. ఈ వైద్య శిబిరాను తహశీల్దార్ భావన్నా రాయణ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. 250 మందికి పైగా వైద్యపరీక్షలు నిర్వహించారు. వైద్యులు వి వెంకట్, టీవి సురేష్ కుమార్ జెఆర్ఎస్ గౌతమ్ లతో పాటు, దంత వైద్యులు నవీన్ కుమార్ రెడ్డి లతో పాటు లయన్స్ క్లబ్ కంకిపాడు అధ్యక్షుడు వన్నాల శివరామకృష్ణ, క్లబ్ సీనియర్ ప్రతినిధి మద్దుల గోవిందరావు పాల్గొన్నారు.

నేడు వినతులు స్వీకరణ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ప్రజా సమస్యల పరిష్కార వేదికను మండల కేంద్రమైన గుడ్లవల్లేరు పంచాయతీ కార్యాలయం వద్ద ఈనెల 23వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు ఏర్పాటు చేస్తున్నట్లు గ్రామ ఆఫీసర్, ఎంపీడీవో టి విజయ సారథి తెలిపారు. గుడివాడ నియోజకవర్గం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై వినతి పత్రాలు, ఫిర్యాదులు స్వీకరించి అధికారులతో చర్చించి త్వరితగతిన సమస్యల పరిష్కరిస్తామన్నారు. ఫిర్యాదుదారులు తప్పనిసరిగా వారి ఆధార్, నెంబరు మొబైల్ నెంబరు వినతిపత్రంలో నమోదు చేసి ఇవ్వాలని తెలిపారు.

చిన్నారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

'విద్యావికాస్'లో గ్రాడ్యుయేషన్ వేడుకలు

ప్రజాశక్తి-గుడివాడ : విద్యావికాస్‌లో యుకెజీ చిన్నారులకు కాన్వొకేషన్(స్నాతకోత్సవం) వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం స్థానిక బైపాస్‌రోడ్డులోని విద్యావికాస్ బ్లూమ్స్‌లో యుకెజి పూర్తిచేసుకున్న చిన్నారులకు ప్రైవేరీ తరగతులకు స్వాగతం పలుకుతూ గ్రాడ్యుయేషన్ డే ను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ కొమ్మినేని సాంబశివరావు, అకడమిక్ డైరెక్టర్ వెల్లంకి రేష్మాచౌదరి, సిసియన్ సిఐ రమణిలు చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ ప్రిన్సిపల్ ఆశీర్వాదం, ఇన్‌చార్జి ఉమాదేవి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మంగినపూడిలో ఫార్మ్ పాండ్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం మండలం మంగినపూడి పంచాయతీలో సర్పంచ్ కూనపరెడ్డి ప్రమీలా రాణి అధక్షతన నీరు నిలువ ఉండుటకు ఫార్మ్ పాండ్ నిర్మాణ పనులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ ఇది వర్షపు నీటి బొట్టును వడిసి పట్టి సాగునీటి ఎద్దడి నివారణ కోసం చేపట్టిన సేద్యపు కుంటలు రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.ఈ కార్యక్రమం కష్ణ జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ, క్లస్టర్ ఇంచార్జి కాగిత వెంకటేశ్వరరావు, క్లస్టర్ ఇంచార్జిలు లంకె శేషగిరి,తలారి సోమశేఖర్, ఎంపిడిఓ సి హెచ్ వెంకటేష్ పాల్గొన్నారు.

పేర్ని నాని వ్యాఖ్యలు హాస్యాస్పదం : యలవర్తి

ప్రజాశక్తి - గుడివాడ : మాజీ మంత్రి పేర్ని నాని గుడివాడ వచ్చి టిడిపిని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని ఎన్‌టిఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఏలూరురోడ్డులోని టిడిపి కార్యాలయంలోని ప్రజా వేదికలో టిడిపి పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబు ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యలవర్తి మాట్లాడుతూ గుర్విందగింజ ఏ విధంగా తన కింద ఉన్న రంగును మార్చుతుందో అదే విధంగా రాష్ట్రాన్ని దోచుకు తిన్న నాయకులు నేడు టిడిపి ప్రభుత్వాన్ని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పేర్ని నాని మంత్రిగా ఉన్న సమయంలో రేషన్ బియ్యాన్ని ఏవిధంగా దోచుకున్నారో అందరికి తెలుసునన్నారు. ఆయన ఇఫ్తార్ విందుకు వచ్చి టిడిపిని విమర్శించడం సిగ్గుచేటన్నారు. ఈ సమావేశంలో రూరల్, నందివాడ మండలాల అధ్యక్షులు వాసే మురళీ, సన్యాసిరావు, మాజీ కౌన్సిలర్లు అడుసుమిల్లి శ్రీనివాసరావు, వసంతవాడ దుర్గారావు, శొంఠి రామకృష్ణ, నాయకులు షేక్ సర్వార్, తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్లో అక్రమ వసూళ్లు

- డబ్బులు ఇవ్వకుంటే షాపులు ఇవ్వబోనని బెదిరింపులు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం రైతు బజార్ లో అధికారి వ్యాపారుల నుంచి అడ్డగోలుగా వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. డబ్బులు ఇవ్వకుంటే షాపు లేకుండా చేస్తానని బెదిరింపులకు దిగుతున్నారని చెబుతున్నారు. నాకు ఉన్నత స్థాయిలో గట్టి పలుకుబడి ఉంది. నేనేం చేసినా నన్ను ఎవరు ఏం చేయలేరని అధికారి బహిరంగ వ్యాఖ్యలు చేస్తున్నాడని అంటున్నారు. ఈయన ఇక్కడికి వచ్చిన దగ్గరనుంచి షాపుల నిర్వాహ కుల నుంచి దండుకోవడమే పనిగా పెట్టుకున్నాడు. ఈయన వివిధ పేర్లతో చేస్తున్న వసూళ్ల సొమ్ము కట్టలేక అందరూ తలలు పట్టుకుంటున్నారు. గన్నవరం ఈ రైతు బజార్లో 63 షాపుల వరకు ఉన్నాయి. కొంతమంది రైతులు ఉన్నా ఎక్కువ మంది వ్యాపారులే ఎక్కడ వ్యాపారం చేస్తున్నారు. ఇదే అదునుగా చేసుకున్న ఎస్టేట్ అధికారి శ్రీనివాసుడు టార్చ్ వేస్తున్నాడట. ప్రతి షాపుకూ నెలనెలా 2000 ఇవ్వండి.. మీకు నచ్చిన రేటు పెట్టి అమ్ముకోండి..నేను పట్టించుకోను..లేదంటే షాపులు లేకుండా చేస్తా అనే మాట వస్తుందట. చాలా కష్టాలు ఉన్నాయి సార్.. అని షాపుల వారంటే.. నా కష్టాలు గురించి ఎవరికి చెప్పన మ్మా అంటున్నారు. ఇదిలా ఉంటే రైతు బజార్లో తూనికలు, కొలతల కేంద్రం నుంచి వచ్చు సిబ్బందికి కటా రెన్యువల్ చేయుటకు 300 రూపాయలు కాగా 900 రూపాయలు వసూళ్లు చేస్తున్నారనే విమర్శ ఉంది. గత 5 ఏళ్ళ నుంచి గుట్టు చప్పుడు కాకుండా ఇదే తంతు నడుస్తోంది. కూలి నాలి పనులు చేసుకోలేక రైతు బజార్ లో కూరగాయలు వ్యాపారం చేసుకోవడానికి వచ్చిన వ్యాపారస్తుల దగ్గర నుంచి నిలువు దోపిడీ కి పాల్పడు తున్నారని విమర్శిస్తున్నారు. వాటర్ డ్రమ్ లు కొనుగోలు చేయాలని షాపుకు వెయ్యి రూపాయలు వసూలు చేశారట. అన్నింటికీ రూ. 60 వేలు వసూలు చేసి డ్రమ్ములు ఎన్ని కొన్నారో అధికారికే తెలియాలి అంటున్నారు.

ఎస్టేట్ అధికారి శ్రీనివాస్ వివరణ

రైతు బజార్లో ఏ విధమైన అదనపు వసూలు చేయడం లేదు. అవినీతి లేదు. ఎవరి నుంచి డబ్బులు వసూలు చేయడం లేదు.

బోరు పంపు మరమ్మతులకు వినతి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : 27వ వార్డు నేతాజీ నగర్ లో బోరు పంపు రిపేర్ చేయించాలని కొండపల్లి మున్సిపాలిటీ ఏఈ వారికి నేతాజీ నగర్ వాసులు వినతిపత్రం అందజేశారు. కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో 27వ వార్డు నేతాజీ నగర్ లో మంచినీరు సమస్య తీవ్రంగా ఉంది. ఎండాకాలం ప్రారంభమైంది మహిళలు పనులకు ఉదయం పూట వెళ్లాలంటే టైంకి మంచినీళ్లు సక్రమంగా రాక తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. అందుబాటులో ఉన్న బోరు రిపేర్‌లో ఉండటంతో తీవ్ర మంచినీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో కొండపల్లి మున్సిపాలిటీలో బోరు పంపు రిపేర్ చేయించి మా నేతాజీ నగర్ మంచినీటి కష్టాలు తీర్చాలని స్థానిక మహిళలు కొండపల్లి మున్సిపాలిటీ ఏఈ మౌస్మి వారినిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నేతాజీ నగర్ ఎ.లక్ష్మి, వి.తిరుపతమ్మ, మరియమ్మ, దుర్గ, సిపిఎం కొండపల్లి పట్టణ కార్యదర్శి యం మహేష్ పాల్గొన్నారు.

తాపీ మేస్త్రీలకు అవగాహన

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : అల్ట్రాటెక్ కంపెనీ సౌజన్యంతో శివానీ ట్రేడర్స్ ఆధ్వర్యంలో తాపీమేస్త్రీలకు అవగాహన కల్పించేందుకు శనివారం కొండపల్లిలో మేసన్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన అల్ట్రాటెక్ సిమెంట్, లిక్విడ్ సాయంతో దఢమైన గహాన్ని నిర్మించుకోవచ్చని కంపెనీ సేల్స్ ఆఫీసర్ జి.సందీప్ అన్నారు. ఎస్ బీఆర్ 5 ప్లస్ లిక్విడ్ వినియోగంతో ఇనుము తుప్పు పట్టదని, భవనం నిర్మాణంలో లీకేజీ లేకుండా ఉంటుందన్నారు. అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీలో మూడు రకాల సిమెంట్ లభిస్తుందని చెప్పారు. ఇందులో సూపర్, పీపీసీ, ఓపీసీ ఉన్నాయన్నారు. సిమెంట్ కాకుండా సిమెంట్ కు తగ్గట్టు లిక్విడ్స్ కూడా అందుబాటులో ఉన్నాయని, ఇందులో వెధర్ ప్రొ ప్లస్ 200, ఎస్ బీఆర్ 5 ప్లస్, హై ఫ్లెక్స్, టైల్ ఫికో అని చెప్పారు. తమ కంపెనీ తరపున మేస్త్రీల ద్వారా ఉచితంగా వాటర్ టెస్ట్, శ్లాబ్ స్ట్రెంత్ చేయనున్నట్లు తెలిపారు. నిర్మాణ సమయంలో చెదల నివారణకు తమ సేవలు అందిస్తామన్నారు. వీఆర్, 3డీ, ఎలివేషన్ సర్వీసులు కూడా అందించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంఎల్ఈలు ఎస్.కె.అబ్దుల్ సుభాన్, కె.వి.ఎన్.నీవస్, శివానీ ట్రేడర్స్ అధినేతలు యక్కల శివ,యక్కల కళ్యాణ్,భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

మందుల దుకాణాల్లో తనిఖీ

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల లో పలు మెడికల్ జనరల్ షాపుల్లో శనివారం డిప్యూటీ తాసిల్దార్ వేమూరి మానస, ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మెడికల్ షాపుల్లో రికార్డులు, బిల్లులు పరిశీలించారు. కాలం చెల్లిన మందులు అమ్మవద్దని, అనుభవ్జులైన వారే మందులు అమ్మాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రెడ్డి పాల్గొన్నారు.

జల్ జీవన్ పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహింపట్నం మండలంలో ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రాం (ఆకాంక్ష మండలాలు) కింద, భారత ప్రభుత్వం చేపడుతున్న జల్ జీవన్ మిషన్ (జె జె ఎం) లో భాగంగా శనివారం ఎమ్‌పిడిఓ కార్యాలయంలో ఇబ్రహింపట్నం మండల కార్యాలయంలో ఎమ్‌పిపి, డిఇ (ఆర్ డెబ్ల్యూ ఎస్) ఆధ్వర్యంలో అన్ని గ్రామ పంచాయతీలకు సంబంధించిన సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలు, ఇఒ (పిఆర్ఆర్డి)ఎంపీ, అకాంక్ష సమన్వయకర్త సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్ డి ఓ సునీత శర్మ మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ (జె జె ఎం) పనులను త్వరగా ప్రారంభించి సమయానికి పూర్తి చేయాలని కోరారు. పనుల నిర్వహణకు అవసరమైన కనీస వనరులు అందుబాటులో ఉంచడం గురించి చర్చించినట్లు తెలిపారు. ఇప్పటికే పైప్‌లైన్‌లు ఉన్నప్పటికీ, ఇంకా టాప్ కనెక్షన్లు లేని ప్రాంతాల్లో పని పూర్తి చేయడానికి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ, మండల, జిల్లా పరిషత్ స్థాయిలో కొంత నిధులను సమీకరించి వెంటనే పనులు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

సొరంగం వద్ద జారిన మట్టిపెళ్లలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : భవానీపురం, 44 వ డివిజన్ సొరంగం కొండ ప్రాంతంలో శుక్రవారం మట్టి పెళ్ళలు జారిపడ్డాయి. ఈ ప్రమాదంలో స్థానిక ఇంటి పైకప్పు రేకులు కొంతమేర దెబ్బతిన్నాయి, అగ్గిపెట్టెల ఫ్యాక్టరీ కొండ ప్రాంతంలో బేస్‌మెంట్ పిచ్చింగ్ జారిపోవడంతో ప్రమాదం జరిగింది. మట్టిపెళ్లలు జారి పడుతుండటంతో ఇళ్లలోని నివాసితులు అప్రమత్తమయ్యారు. కింది భాగాన ఉన్న రేకుల షెడ్డుపై మట్టి పెళ్లలు పడటంతో ఇంటి పైకప్పు రేకులు దెబ్బతిన్నాయి. ఈ ఘటనలో ఎవరికి ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ ఎన్డీఏ కూటమినేతలతో కలిసి శనివారం పరిశీలించారు. కూటమి నేతలు మల్లెపు విజయలక్ష్మి, వేంపలి గౌరీ శంకర్, ముదిగొండ శివ, శనివారపు శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ నీటి దినోత్సవంపై ర్యాలీలు

ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా కళాశాలలు, కార్యాలయాలు ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ నీటిని ఆదా చేసి భవిష్యత్తును కాపాడాలంటూ పలువురు వక్తలు సూచించారు. పలుచోట్ల నీటి కుంటలు తవ్వకం పనులు ప్రారంభించారు. ఉపాధి హామీ పనులు ప్రారంభించారు.

ప్రజాశక్తి - మైలవరం : స్థానిక లక్కిరెడ్డి బాల్రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రకృతి క్లబ్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నీటి పరిరక్షణపై అవగాహన పెంచేందుకు శనివారం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. నీటిని ఆదా చేయండి భవిష్యత్తును కాపాడండి అంటూ ప్ల కార్డులు చేత పట్టుకొని నినాదాలు చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా నీటిని సరైన విధంగా ఉపయోగించాలని సూచించారు. ప్రపంచ అటవీ సంరక్షణ దినోత్సవం గ్లోబల్ రీసైక్లింగ్ డే అనే అంశాలలో విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్, వక్తృత్వ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రమేష్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం అధికారి శివ హరిప్రసాద్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట :** మండలంలోని బండిపాలెం గ్రామంలో ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పంట కుంటలు తవ్వుదాం - భూగర్భ జలాలు పెంచుదాం అనే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య రైతులు, ఉపాధి కూలీలతో కలిసి పొలంలో పంట కుంటల త్వవకం ప్రారంభించారు. **జగ్గయ్యపేట :** మండలంలోని గరికపాడు గ్రామంలో గల డాక్టర్ కెఎల్ రావు కృషి విజ్ఞాన కేందంలో ప్రపంచ నీటి దినోత్సం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త డా పి.యన్. శివప్రసాద్ ఆహార ఉత్పత్తిలో, వివిధ పంటలో నీటి ప్రాధాన్యతను వివరించారు. **నందిగామ :** అన్నదాతల్లో చైతన్యం కలిగించి ప్రతి పంచాయతీలో పదికి తగ్గకుండా రాష్ట్రంలో రెండు లక్షల నీటికుంటలు తవ్వాలనే కూటమి ప్రభుత్వం లక్ష్యం పెట్టుకుందని ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. జిల్లా నందిగామ మండలం మునగచర్ల గ్రామంలో వ్యవసాయ క్షేత్రాల్లో నీటి కుంటలు (ఫారంపాండ్స్) తవ్వకాలకు కూటమి నేతలు, రైతులతో శ్రీకారం చుట్టారు.ఈ మేరకు ఆమె మాట్లాడుతూ, గత చంద్రబాబు ప్రభుత్వంలో ఉపాధి హామీ పథకం ద్వారా ఫారంపాండ్స్ తవ్వకాల కోసం రైతులను ప్రోత్సహించిందనీ గుర్తు చేసుకున్నారు. రైతు పొలాల్లో నీటి కుంటలు (ఫారంపాండ్స్) తవ్వకాలు చేయడం వల్ల భూగర్భ జలాలు పెంచడంతో పాటు భూమిలో తేమ శాతం, పశువులకు తాగునీరు, పంటలకు పురుగు మందులు పిచికారి నీరు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వీరంకి వీరస్వామి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు. **తిరువూరు :** తిరువూరు మండలం ఆంజనేయ పురం గ్రామంలో జాతీయ జల దినోత్సవం సందర్భంగా ఉపాధి హామీ పథకం కింద ఇంకుడు గుంటలకు శ్రీకారం చుట్టారు. ప్రతి ఒక్క రైతు ఇంకుడు గుంటలు ఉపాధి హామీ పనుల ద్వారా ఏర్పాటు చేసుకోవాలని సర్పంచ్ మామిడి కుటుంబరావు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గద్దల భారతి, జడ్పీటీసీ రామచంద్రారెడ్డి, ఎంపీడీఓ రవిబాబు, ఏపీఓ మున్ని, షేక్ మస్తాన్, మామిడి శరత్, షేక్ హిమాం, వేట జములయ్య పరిటాల శ్రీను, అల్లరి కష్ణయ్య రామారావు, ఉపాధి హామీ కూలీలు ,గ్రామ పెద్దలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. **చందర్లపాడు :** వర్షాకాలంలో వృథాగా వాననీటిని ఒడిసి పట్టి భూమిలోకి ఇంకిపోయేలా చర్యలు తీసుకుంటే భూగర్భ జలాలను కాపాడుకోవచ్చని, వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చూసుకోవచ్చని కోనాయపాలెం గ్రామ టిడిపి అధ్యక్షుడు సీనియర్ నాయకులు గుత్తికొండ రాంబాబు, సర్పంచ్ మార్కపూడి వెంకట్రావమ్మ అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా కోనాయపాలెం గ్రామంలోని ఉపాధిహామీ ఫీల్డ్ స్టాఫ్ పోతుమర్తి వెంకట్రావ్ మరియు గ్రామస్తులతో కలిసి గ్రామ నాయకులు రాంబాబు, వెంకట్రావమ్మ ఇంకుడు గుంతను శనివారం ప్రారంభించారు. **విస్సన్నపేట :** జల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉపాధి హామీ పథకాన్ని మండలంలోని తెల్లదేవరపల్లి గ్రామంలో ప్రారంభించారు. ఎంపిపి వనజాక్షి రాజేష్ పనులు ప్రారంభించారు. మండలంలోని ప్రతి పంచాయతీకి ఫారాంపాండు నీటి కుంటలు ఒక్కటిగా ప్రారంభించారు. అందులో భాగంగా తాతకుంట్ల పంచాయతీలోని గౌరంపాలెం గ్రామ పరిధిలో భూమి యజమాని మహబూబ్ తోటలో కుంటలు తవ్వకం నిర్వహించారు. **కంచికచర్ల :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంద్వారా 'ప్రపంచ జల దినోత్సవంలో భాగంగా పంట కుంటలు తవ్వుదాం 'భూగర్భ జలాలు పెంచుదాం' కార్యక్రమం శనివారం ప్రారంభించారు. మండలంలోని 11 గ్రామపంచాయతీల్లో చెవిటికల్లు, గండేపల్లి, గనిఆత్కూరు, గొట్టుముక్కల, కీసర, కునికినపాడు, కొత్తపేట, మొగులూరు, పరిటాల, వేములపల్లి 11 పంట కుంటల తవ్వకం ప్రారంభించారు. స్థానిక మిక్ కాలేజీ అఫ్ టెక్నాలజీలో అంతర్జాతీయ వాటర్ డే సందర్భంగా ఐసిఇ విభాగం ఆధ్వర్యంలో శనివారం వివిధ పోస్టర్స్, చిత్రాల ప్రదర్శన జరిపించారు. ప్రపంచంలో అత్యంత ముఖ్యమైన వనరుగా ఉన్న నీటి విలువ, నీటి ఆవశ్యకత గురించి విద్యార్థులకు అవగా హన కల్పించేందుకు ఈ కార్యక్రమం జరిపించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. టి.వంశీ కిరణ్ తెలిపారు. **నందిగామ :** ప్రపంచ జలదినోత్సవాన్ని పురస్కరించుకొని నందిగామ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంత ప్రారంభోత్సవ కార్యక్రమంలో చైర్ పర్సన్ మాట్లాడుతూ నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత, ఇంకుడు గుంతల ఏర్పాటుతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని, భూగర్భ జలాలు పెరిగేందుకు దోహద పడతాయన్నారు.

ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న ఎల్‌బిఆర్‌సిఇ విద్యార్థులు

పిహెచ్‌సిలో తనిఖీ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండలం గోళ్లమూడి గ్రామంలో పిహెచ్‌సి (ప్రైమరీ హెల్త్ సెంటర్)ను నందిగామ రెవిన్యూ డివిజనల్ అధికారి కె.బాలకృష్ణ శనివారం తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్సీ నందు అందించే వైద్య సేవలు, మందులు పిహెచ్‌సిలో గల సౌకర్యాలను పరిశీలించారు. పిహెచ్‌సి పరిశరాలు పరిశుభ్రంగా ఉంచాలి అని, సిబ్బంది అందుబాటులో ఉండాలి అని తెలిపారు. నందిగామ తహశీల్దార్ ఎన్.సురేష్ బాబు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర-2047పై అవగాహన

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ చైతన్య కాలేజీలో స్వర్ణ ఆంధ్ర 2047 అవగాహన సదస్సు కార్యక్రమంలో నందిగామ మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లా డుతూ కాలేజీ విద్యార్థునులకు శ్రీ శక్తి యాప్ తప్పనిసరిగా డౌన్లోడ్ చేసుకోవాలని, ఈ యాప్ వల్ల ఏ సమయంలో అయినా పోలీసు శాఖ వారు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. అనంతరం కళాశాల కరస్పాం డెంట్ ప్రిన్సిపల్ అమరనేని రమేష్‌ని కలిసి కాలేజీలోని విద్యార్థునులందరికీ శ్రీ శక్తి యాప్ డౌన్లోడ్ చేయించే విధంగాలా తీసుకోవాలని సూచించారు. విశ్వనాథపల్లి కృపారావు, ఎమ్మార్వో కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

27న నందిగామ ఎంపిపి ఎన్నిక

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ మండల పరిషత్ అధ్యక్షురాలి ఎంపిక కోసం ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల ఈనెల 27న ఎంపీపీ ఎన్నిక కానుంది. ఈ పదవి యస్సీ మహిళకు రిజర్వు కాగా గతంలో యంపిపి గా పనిచేసిన కేతవీరునిపాడు యంపిటీసీ సభ్యురాలు అరిగెల సుందరమ్మ గత ఏడాది జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలకు కొద్ది రోజుల ముందు తన పదవికి రాజీనామా చేశారు. అనంతరం జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో యంపిపీ ఎన్నిక ప్రక్రియ నిలిచిపోగా ఎట్టకేలకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది.

సాగర్ జలాల పరిశీలన

ప్రజాశక్తి - తిరువూరు : నాగార్జునసాగర్ ఎడమ కాలువ 2వ జోన్ లో మధిర బ్రాంచ్ కాలువ నుండి తిరువూరు మండలం వావిలాల గ్రామంలోని ముష్టికుంట్ల మేజర్ కు విడుదలవుతున్న సాగర్ జలాలను శనివారం ఎన్ ఎస్పీ కాలువల ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు, ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు స్థానిక డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ గంద్ర ప్రసాద్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రామదాసుతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 14వ కిలోమీటర్ రెగ్యులేటర్ నుండి దిగువకు 1100 క్యూసెక్కులు, ముష్టికుంట్ల మేజర్ కు 50 క్యూసె క్కులు నీటి విడుదలను గమనించారు. ప్రపంచ జల దినోత్సవ సందర్భంగా ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందించడానికి విశేషంగా కృషిచేసి ఆయకట్టుకు జలభద్రతను కల్పించిన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే.రామదాస్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.సునీతను వారు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వీరబాబు మాట్లాడుతూ జల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రస్తుతం ఆయకట్టులో ఒక కిలో వరి తయారు కావడానికి మూడు వేల లీటర్ల నీరు అవసరమని, ఒక కిలో న్యూస్ పేపర్ తయారు కావడానికి 11 వేల లీటర్ల నీరు అవసరమని సమాజంలో ప్రతి ఒక్కరు నీటిని ఆదా చేసి భవిష్యత్ తరాలకు నీటి భద్రతను కల్పించాలని పిలుపునిచ్చారు. సాగునీటి వినియోగ దారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ నాగార్జునసాగర్ ఎడమ కాలువ 2వ జోన్ కు చివరి వరకు సాగుచేసిన పంటలను రక్షించడానికి మరొక వారం రోజులు నీరు విడుదల సమయాన్ని పెంచాలని తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌లు గంద్ర ప్రసాద్, కటారి కోటేశ్వర రావు ఆయకట్టు ప్రముఖులు కొమ్మినేని రాధ, ఎస్కే ముస్తఫా, కొమ్మినేని ప్రసాద్, ఆలపాటి అబ్బులు, గంద్ర వీర భద్రరావు నీటి సంఘం అధ్యక్షులు చేకూరి కష్ణ, గొడవర్తి భాస్కరరావు ఎన్.ఎస్.పి. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పి.సునీత, మహేష్, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని బైకిస్ట్ మృతి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని గరికపాడు చెక్‌పోస్ట్ వద్ద శనివారం వత్సవాయి మండలం లింగాల గ్రామానికి చెందిన ఆధర్ల వంశీకృష్ణ (20) కోదాడ నుండి స్వగ్రామం లింగాల స్కూటీపై వెళుతుండగా అనుమంచిపల్లి గ్రామ సమీపంలోని బోర్డర్ రెస్టారెంట్ వద్ద స్కూటీ రోడ్డు డివైడర్‌కు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని జగ్గయ్యపేట ప్రభుత్వ ఆస్పత్రికి పంచనామా కోసం తరలించారు. మృతుని తండ్రి ఆధర్ల శీను బాబు ఫిర్యాదు మేరకు చిల్లకల్లు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిందితులను శిక్షించాలని ట్రాన్స్‌జెండర్ల ర్యాలీ

ప్రజాశక్తి - నందిగామ : దీపు ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రాత్రి నందిగామ గాంధీ సెంటర్‌లో ట్రాన్స్ జెండర్స్ క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. సహస్ర, బిందు (ట్రాన్సజండర్) ఆధ్వర్యంలో ప్రేమ పేరుతొ కొంతకాలం సహజీవనం చేసి దీపు అనే ట్రాన్స్‌జెండర్‌ని నమ్మించి హత్య చేసిన హంతకుడుని త్వరగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నందిగామలో ట్రాన్స్ జండర్స్. కొవ్వత్తుల ర్యాలీ నిర్వహించారు. నందిగామ గాంధీ సెంటర్‌లో బ్యానర్ చేత బూని నినాదాలు చేస్తూ అనకాపల్లిలో ట్రాన్స్ జెండర్ దీపు ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని నందిగామ లో గల ట్రాన్స్ జెండర్స్ కమ్యూనిటీ డిమాండ్ చేశారు.

వెంకటేశ్వరరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు మాజీ ఉప సర్పంచ్ జరుగు వెంకటేశ్వరరావు చిరస్మరణీయుడని జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం ఉప సర్పంచ్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా జనసేన యువ నాయకులు జరుగు పోతురాజు ఆధ్వర్యంలో కోడూరు ప్రధాన సెంటర్లో వెంకటేశ్వరరావు వర్ధంతి సభను నిర్వహించారు. ముందుగా వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం 300 మంది నిరుపేదలకు వస్త్ర దానం చేసి, అల్పాహార పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

వికలాంగుల ట్రస్ట్ ఏర్పాటు

ప్రజాశక్తి - గుడివాడ : వికలాంగులకు ఉపాధి, ఎడ్యుకేషన్ల ద్వారా అన్ని రంగాలలో తీర్చిదిద్దేందుకు దివ్యాంగుల ట్రస్ట్ ఏర్పాటు చేసినట్లు ప్రపంచ దివ్యాంగుల డెవలప్‌మెంట్ ట్రస్టు ఫౌండర్ చింతకాయల మోహనకుమార్ అన్నారు. శనివారం స్థానిక ఎన్‌టిఆర్ ఇండోర్ స్టేడియంలో ప్రపంచ దివ్యాంగుల సంస్థ ట్రస్టును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పౌండర్ మోహనకుమార్ మాట్లాడుతూ దివ్యాంగులను ఆదుకునేందుకు గుడివాడలో తమ సంస్థను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. స్పోర్ట్స్ డైరెక్టర్‌గా పంతంగి శివానాగేశ్వరరావును నియమించడం జరిగిందన్నారు. సభ్యులుగా ఎం.రమణమూర్తి, ఎం.వెంకటేశ్వరరావు, రమాదేవి, ఆశాలతలను ఎన్నుకోవడం జరిగిందన్నారు. వీరి ద్వారా దివ్యాంగులకు అన్ని రంగాలలో నిలబడే విధంగా చదువుతో పాటు శిక్షణ కల్పించి వారికి ఉపాధి అవకాశాలను చూపిస్తామన్నారు.

ఘనంగా బూసిమ్మతల్లి తిరునాళ్లు

ప్రజాశక్తి-ఉయ్యూరు : ముదునూరులో జరుగుతున్న బూసిమ్మతల్లి తిరునాళ్ల సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ శనివారం అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. అమ్మవారి కరుణ కటాక్షాలతో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాల చైర్మన్ మండవ జయదేవ్, మండల టీడీపీ అధ్యక్షుడు యెనిగళ్ళ కుటుంబరావు, జబర్లపూడి సర్పంచ్ సూరపనేని శేషవరప్రసాద్, సాయిపురం సర్పంచ్ షేక్ జాన్బాషా తదితరులు అమ్మవారిని దర్శించి పూజలో పాల్గొన్నారు. పద మూడు రోజులుగా అత్యంత వైభవంగా జరుగుతున్న బూసిమ్మ తిరునాళ్లకు పలుప్రాంతాలనుంచి భక్తులు తరలివస్తున్నారు.

150 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-ఉయ్యూరు : రోటరీక్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో శనివారం పెదఓగిరాలలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించి 150 మందికి నేత్ర, దంత, ఇతర వైద్య పరీక్షలు చేసి మందులు అందచేశారు. క్లబ్ అధ్యక్షుడు చొప్పరపు నాగసుబ్రమణ్యం, కేసీపీ జీఎం వీవీ పున్నారావు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. రోటరీ నేత్రవైద్యశాల డాక్టర్లు, సిబ్బంది, ఇతర వైద్యులు, సిబ్బంది పాల్గొని వైద్యసేవలందించారు. క్లబ్ కార్యదర్శి అమీర్ మీర్జా, సభ్యులు వెంకటేశ్వ రరావు, రామచంద్రరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొని సేవలందించారు.

బందరులో డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కృషి : మంత్రి

డ్రైనేజీలు పరిశీలిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి కలెక్టరేట్ (కృష్ణా) : మచిలీపట్నం నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని రాష్ట్ర గనులు భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. శనివారం మంత్రి మచిలీపట్నం నగరంలోని మున్సిపల్ కార్యాలయము, రాజావారి సెంటర్, బస్టాండ్ సెంటర్, జిల్లా కోర్టు సెంటర్, లక్ష్మీ టాకీస్ సెంటర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి మురికి కాలువలను పరిశీలించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో డ్రైనేజీ సమస్య ప్రధానమైన సమస్య అని, ఈ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ముఖ్యంగా వర్షాలు కురిసినప్పుడు మొత్తం రహదారులన్నీ జలమయం అవుతున్నాయన్నారు. మొత్తం జడ్పీ సెంటర్ నుండి ప్రధాన రహదారిలో దష్టి పెట్టి లక్ష్మీ టాకీస్ సెంటర్, జిల్లా కోర్టు సెంటర్, బస్టాండ్ సెంటర్, కోనేరు సెంటర్, రాజుపేట వరకు కూడా ఎలా పరిష్కారం చేయాలో ఆలోచించామన్నారు. ఇందులో భాగంగా మొట్టమొదట మున్సిపల్ కమిషనర్ వారి సిబ్బంది గత 20 రోజులుగా మురికి కాలువలపై ఉన్న ఆక్రమణలను తొలగించే కార్యక్రమం చేపట్టారన్నారు. కాలువల న్నింటిలో ఉన్న మురికి పూడికలను తక్షణమే తొలగించే పనులు చేపట్టాలని సూచించామన్నారు. పూడికలు అంతా తొలగింపు కోసం దాదాపు 80 నుంచి కోటి రూపాయలు ఖర్చు అయ్యే అవకాశం ఉందన్నారు. ఇందుకోసం టెండర్ల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ను సూచించామన్నారు. ఈ పర్యటనలో మంత్రి వెంట మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, మున్సిపల్ మాజీ చైర్పర్సన్ మోటమర్రి బాబా ప్రసాద్, మున్సిపల్ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

నిషేధిత మందుల విక్రయంపై విచారణ జరపాలి : టిడిపి

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలో భార్గవ మెడికల్ షాపులో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారుల తనిఖీల్లో బయటపడ్డ ట్రెమడాల్ సంబంధిత మందులు విక్రయానికి మాజీ మంత్రి బెల్లంపల్లి శ్రీనివాస్ అండదండలే కారణమని టిడిపి నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు ఆరోపించారు. శనివారం పార్టీ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కొనకళ్ళ రామ్మోహన్రావు నిర్వహిస్తున్న మందుల షాపులో నిషేధిత మందులు ఇంజక్షన్లు బయటపడటం ఒకసారిగా అవనిగడ్డ ప్రజలనే కాక అధికారులను సైతం ఆశ్చర్యానికి గురిచేసింది అన్నారు. దీని వెనక మాజీ మంత్రి హస్తం ఉందని, కొనకళ్ళ రామ్మోహన్రావు సోదరుడు విద్యాధరరావు బెల్లంపల్లికి ప్రధాన అనుచరులు అన్నారు. ట్రె మ డాల్ నిషేధిత మందులు విక్రయంపై స్థానిక పోలీసులతో కాకుండా ఉన్నత స్థాయి అధికారులతో విచారణ జరిపించాలన్నారు. కొనకళ్ళ రామ్మోహన్రావును పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తేనే అసలు నిజాలు బయటికి వస్తాయన్నారు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరు వెంకటేశ్వరరావు, కోడూరు మండల పార్టీ అధ్యక్షులు బండే శ్రీనివాసరావు, నీటి సంఘాల డిసి చైర్మన్ బచ్చు రఘునాథ్, లీగల్ సెల్ నాయకులు కర్ర సుధాకర్, మేడికొండ విజయ్ పాల్గొన్నారు

కొనకళ్ల రామ్మోహనరావు అరెస్ట్

విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు ఆకస్మికంగా జరిపిన దాడుల్లో అవనిగడ్డలోని భార్గవ మెడికల్ స్టోర్లో నిషేధిత ట్రెమడాల్ మాత్రలు ఇంజక్షన్లు విక్రయిస్తున్నట్లు గుర్తించడంతో ఆ షాపు యజమాని కొనకళ్ళ రామ్మోహన్ రావుపై కేసు నమోదు చేసి పోలీస్ స్టేషన్ కు అప్పగించగా ఆయనను శనివారం కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు. రామ్మోహన్రావుకు ఆరు రోజులపాటు జడ్జి రిమాండ్ విధించినట్లు తెలిపారు.

ఇంగ్లీషు భాషతో ప్రపంచ వ్యాప్తంగా అవకాశాలు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : ప్రపంచవ్యాప్తంగా ప్రాధాన్యత కలిగిన భాష ఇంగ్లీష్ భాష అని మచిలీపట్నం పోరానుపేట లోని సెయింట్ ఫ్రాన్సిస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ రెవ ఫాదర్ జోజి బాబు తెలిపారు. శనివారం సెయింట్ ఫ్రాన్సిస్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు హ్యాపీ ఇంగ్లీష్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జోజిబాబు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా గ్లోబలైజేషన్ అనంతరం ఇంగ్లీష్ ప్రాధాన్యత పెరిగిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక భాషలో ఉన్నప్పటికీ ప్రజలందరు ఎక్కువగా సంభాషించే ప్రధాన భాష ఇంగ్లీష్ అని, చిన్నతనం నుండి విద్యార్థులు ఇంగ్లీషులో భాషలో ప్రావీణ్యం పొందాలన్నారు. ఇంగ్లీష్ భాషతో ప్రపంచ వ్యాప్తంగా అవకాశాలు అందిపుచ్చుకోవచ్చు అన్నారు. స్థానిక మాతభాషలు ఉన్నప్పటికీ ప్రపంచవ్యాప్తంగా ఇంగ్లీషుకు ప్రాధాన్యత ఉందన్నారు. విద్య,ఉద్యోగ అవకాశాలు పొందేందుకు ఇంగ్లీష్ ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సెయింట్ ఫ్రాన్సిస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రిన్సిపాల్ సి బి ఆంటోనీ, చీఫ్ కోఆర్డినేటర్ విజయ ఫ్రాన్సిస్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ హెచ్ఓడి సి పావని, ఉపాధ్యాయులు నళిని, ప్రియదర్శిని, జోయల్ పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-గన్నవరం : నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించటమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగ విజయోత్సవం, వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో 15వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తానని హామీ ఇచ్చానని, ఆ దిశగా కషి చేస్తున్నట్లు తెలిపారు. ఐదేళ్లలో ఉద్యోగాలు కల్పించకపోతే వచ్చే ఎన్నికలలో ఓటు అడగను అని చెప్పానన్నారు. ఇప్పటికే 7వేల మందికి ఉద్యోగాలు ఇచ్చిన ఆ పరిస్థితి ఉందన్నారు. మూతపడిన అశోక్ లేల్యాండ్ను పునః ప్రారంభించామని తెలిపారు. మల్లవల్లి, వీరపనేనిగూడెం ఇండస్ట్రియల్ కారిడార్లు అభివద్ధి చేయడానికి అవకాశాలు ఉన్నాయన్నారు. అనంతరం ఉద్యోగాలు సాధించిన వారికి అపాయింట్మెంట్ లెటర్లను అందజేశారు. పలు పోటీలలో రాణించిన వారికి బహుమతులు, ట్రోఫీలు అందజేశారు. వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, సర్పంచ్ బడుగు 3 బాలమ్మ, ఎంపీడీవో టి.స్వర్ణలత, పంచాయితీ కార్యదర్శి సరోజిని, ప్రిన్సిపాల్ వివి కష్ణమోహన్, రమేష్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ ప్రతినిధి ఎన్.సురేష్‌బాబు పాల్గొన్నారు.

బుద్ధప్రసాద్‌కు సత్కారం

ప్రజాశక్తి-కోడూరు: అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ చైర్మనుగా నియమితులు అయిన సందర్భాన్ని పురస్కరించుకొని కోడూరు శ్రీ గంగానమ్మ దేవాలయ చైర్మన్ కోట యుగంధర రావు మండలిని ఆత్మీయంగా సత్కరించారు. శనివారం అవనిగడ్డ ఎమ్మెల్యే స్వగహం వద్ద ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసి దుశ్శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. అనంతరం ఈనెల 31న శ్రీ గంగాన జాతర మహోత్సవం ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యేకు అందజేశారు. పూతబోయిన లక్ష్మణరావు, కంచర్లపల్లి శశి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మోపిదేవి :** అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ చైర్మనుగా నియమితులైన బుద్ధప్రసాదుకు శనివారం ఉదయం మోపిదేవి శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థాన వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు. ఎమ్మెల్యే స్వగహంలో దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల కార్యనిర్వాహణ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాద రావు ఆధ్వర్యంలో సత్కరించారు.

నీటి పన్నులు ఒకేసారి కట్టాలని నోటీసులు ఇవ్వడం తగదు : సిపిఎం

పెనమలూరు : తాడిగడప మునిసిపాలిటీలో నాలుగు సంవత్సరాల నీటిపన్ను ఒకేసారి ఈనెల 31వ తేదీలోపు కట్టాలని మునిసిపల్ కమిషనర్ నోటీసులు ఇవ్వడం తగదని పెనమలూరు సిపిఎం మండల కార్యదర్శి ఎస్‌కె ఖాసీం అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల నీటిపన్ను ఐదు వేల రూపాయలు ఒకేసారి కట్టకపోతే చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పడం దారుణమని, దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. అలాగే ఇంటి పన్నులు కూడా మూడింతలు పెంచి కట్టకపోతే జరిమానాలు విధిస్తామని ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. ప్రజాచైతన్య యాత్రలో వచ్చిన అర్జీల పరిష్కారానికి సోమవారం పోరంకి మునిసిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తులు, మండల ఐద్వా మహిళ సంఘం కార్యదర్శి పుసులూరి పాతలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

వేలం పాటలు వాయిదా

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో శనివారం నిర్వహించిన వేలం పాటలు పాటదారులు లేక వాయిదా పడ్డాయి. ఏప్రిల్ 2025 నుండి మార్చి2026 ఒక సంవత్సర కాలం పరిమితికి గాను సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం ద్వారా వివిధ కేటగిరిలో లైసెన్స్ హక్కులకు సీల్డ్ టెండర్ కోరుతూ బహిరంగ వేలం పాట నిర్వహించారు. వాహన పార్కింగ్ రుసుము వసూలు చేసుకొను లైసెన్స్ హక్కునకు ధరావతు ఒక్కరే చెల్లించడం వలన పాటను వాయిదా వేశారు. క్లోక్ రూమ్ (యాత్రికుల వస్తు సామాగ్రి, సెల్ఫోన్లు) భద్రపరిచి రుసుము వసూలు చేసుకుని లైసెన్స్ పొందే హక్కునకు ధరావతు చెల్లించి ఎవరు పాటలో పాల్గొనక పోవడం వలన వాయిదా వేశారు. పాటదారులు, గ్రామస్తులు, భక్తుల సమక్షంలో డిప్యూటీ కమిషనర్, ఆలయ కార్యనిర్వాహణ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు, ఆలయ సిబ్బంది మోపిదేవి సకలేశ్వర స్వామి వారి దేవస్థానం ఈవో ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీహరిరావు హత్యపై విమర్శలు తగదు : టిడిపి

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ డాక్టర్ శ్రీహరిరావు హత్య ఉదాంతాన్ని ప్రస్తావించినప్పుడల్లా మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ఎందుకు ఉలికి పడుతున్నారని టిడిపి నాయకులు ప్రశ్నించారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో 2020లో అవనిగడ్డలో ప్రముఖ వైద్యుడు డాక్టర్ కోట శ్రీహరిరావు హత్యకు గురయ్యారని, అప్పటి ప్రభుత్వం ఆ హత్యపై ఎటువంటి విచారణ చేయలేదని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ చొరవతో సిబిసిఐడి ఎంక్వయిరీ వేయించి విచారణను వేగవంతం చేయాలని శాసనసభలో ఎమ్మెల్యే ప్రస్తావిస్తే దానిపై మాజీ ఎమ్మెల్యే రమేష్‌బాబు విమర్శ చేయడం సరికాదన్నారు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరు వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి డి సి వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ ప్రసాద్, నీటి సంఘం అధ్యక్షులు దాసినేని శ్రీనివాసరావు, టిడిపి నాయకులు సోలే శ్రీనివాసరావు కొల్లూరి వాసు తదితరులు పాల్గొన్నారు.

గంటా బాలస్వామికి నివాళి

ప్రజాశక్తి - గుడివాడ : నేటి యుగంలో తల్లిదండ్రులను అనాధ ఆశ్రమాలలో వదలి వెళుతున్న తరుణంలో 41 సంవత్సరాలుగా తండ్రి గంటా బాలస్వామి జ్ఞాపకార్థం పేదలకు, వృద్ధుల కోసం దుస్తులు, భోజనం సదుపాయాలు కల్పించడం అభినందనీయమని ఫాదర్ గుజ్జుల మైఖేల్ అన్నారు. శనివారం స్థానిక ఏలూరురోడ్డులోని మౌంట్ కార్మెల్‌మాత (ఆరోగ్యం) దేవాలయంలో గంటా బాలస్వామి కుమారులు, కుమారైలు ఏర్పాటు చేసిన భోజనం, టిఫిన్, పండ్లును ఫాదర్ గుజ్జుల మైఖేల్, సహాయ గురువు ఫాదర్ అందుగుల శ్రీకాంత్‌ల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ అధ్యక్షుడు ఏలేటి విలియంజోషి, సభ్యులు ఇంటి స్వామిదాసు పాల్గొన్నారు.

సదస్సును ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ గద్దె రామ్మోహన్‌రావు

సెబి ఆధ్వర్యంలో మ్యుచువల్ ఫండ్‌పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియాతో (సెబీ) - అసోసియేషన్ ఆఫ్ మ్యుచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (ఏఎంఎఫ్ఐ) ఆధ్వర్యంలో నగరంలోని హోటల్ నోవాటెల్‌లో శనివారం 'మ్యుచువల్ ఫండ్ సహీ హై' అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సును శాసన సభ్యులు గద్దె రామమోహన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మ్యూచువల్ ఇన్‌వెస్ట్‌మెంట్ గురించి తెలుసుకోవాలని అన్నారు. నగర వాసులకు ఆర్థిక అవసరాలు గురుంచి తెలియచేయడానికి ఇటువంటి సదస్సు ఏర్పాటు చేయడం పట్ల సెబిసి అభినందించారు. ఈ కార్యక్రమంలో సెబీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మనోజ్ కుమార్, ఎఎంఎఫ్ఐ 1 చీఫ్ ఎగ్జిక్యూటివ్ వెంకట్ చలసాని, పలువురు ఆర్థిక రంగ ప్రముఖులు ఇందులో పాల్గొన్నారు.

బార్ అధ్యక్షునిగా వెంకటరెడ్డి

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బార్ అసోసి యేషన్ అధ్యక్షులుగా సీనియర్ న్యాయవాది చింతల వెంకటరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేషన్ ఎన్నికలను న్యాయవాది జీవన్ బాబు అధికారిగా వ్యవహరించి నామినేషన్లు ఎస్వీకరించారు. ఒక ప్యానల్ నుండి నామినేషన్లు రావడంతో అధ్యక్షులుగా వెంకట రెడ్డి, కార్యదర్శిగా నల్లపాటి సుబ్బారావు, ఉపాధ్యక్షులుగా మేకల రవి తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీకి న్యాయ వాదులు అభినందనలు తెలిపారు.

ఆర్‌కె కళాశాలలో నేషనల్ ఫెస్ట్

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఆర్కే కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో టెక్నార్క్ టు కే 25 ఏ నేషనల్ లెవెల్ టెక్ ఫెస్ట్‌ను సిఎస్సి, ఏ ఎమ్ ఎల్, డిఎస్ విభాగాల వారు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మొదటి గా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకృష్ణయ్య, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఐ సాయిరాం, విభాగధిపతి కే కోటేశ్వరరావు మరియు ఏఐఎంఎల్ అండ్ డేటా సైన్స్ విభాగాధిపతి ఎస్‌కె శుబాష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాల నుంచి సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొని పోస్టర్ ప్రజెంటేషన్, టెక్నికల్ క్విజ్, పి పి టి ప్రజెంటేషన్, ప్రాజెక్ట్ ఎక్స్పో లలో వారి ప్రతిభను కనబరుచుటకు ఇది చక్కని వేదిక అని ఆర్కే కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకృష్ణయ్య అన్నారు. ఈ పోటీలో పాల్గొని వారి ప్రతిభాపాటవాలను విద్యార్థులు పెంపొందించుకోవాలని ఆయన తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ సాయిరాం మాట్లాడుతూ ఇటువంటి టెక్నికల్ ఫెస్టివల్స్ నిర్వహించడం ఒక్క ఇంజనీరింగ్ విద్యార్థులకు మాత్రమే చెల్లుతుందని తెలిపారు. అనంతరం విజేతలకు ప్రశంసా పత్రం, బహుమతులను అందించారు.

మహిళ గొంతుకోసిన అగంతకుడు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: కొండపల్లి వెంకటేశ్వర థియేటర్ సెంటర్ సమీపంలో ఇంటిలో ఉన్న మహిళ రమాదేవిపై ఆగంతకుడు దాడి చేసి గొంతుకోసి మెడలోని చైన్ దొంగిలించి నట్లుగా సమాచారం. టీ కొట్టు నడుపుకునే బాబ్జి ఇంట్లో లేని సమయంలో అతని భార్య రమాదేవిపై ఈ దాడి జరిగినట్లుగా పోలీసులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన రమాదేవిని విజయవాడ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న వెంటనే ఇబ్రహీంపట్నం పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీం డాగ్ స్క్వాడ్ సంఘటన స్థలానికి చేరుకున్నారు.

ప్రమాదంలో బాలికల భద్రత

మహిళలు, బాలికల భద్రత ప్రమాదంలో పడుతోంది. వారి భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామని ప్రభుత్వాలు, అధికారులు చెబుతున్న మాటలు నీటిమూటలవుతున్నాయి. రోడ్డుమీదకు వచ్చిన బాలికలు భద్రంగా ఇంటికి తిరిగి వెళ్లే పరిస్థితి లేకుండా పోతోంది. దీనికి ఇటీవల గన్నవరం మండలం వీరపనేనిగూడెంలో మైనర్‌బాలికపై సామూహిక అత్యాచార ఘటన దీనికి అద్దం పడుతోంది. గంజాయి, మద్యం నియంత్రణలో ప్రభుత్వాలు పోలీస్ వైఫల్యాన్ని ఈ ఘటన ఎత్తి చూపుతోంది.

గన్నవరం మండలం వీరపనేనిగూడెంలో స్నేహితురాలి ఇంటికి వచ్చిన జి.కొండూరుకు చెందిన బాలిక కీచకుల బారినపడింది. తిరిగి ఇంటికి వెళ్లడానికి రోడ్డుమీదుకు వచ్చి వాహనం కోసం ఎదురుచూస్తున్న బాలికను మైనర్‌బాలుడు, షేక్ అబ్దుల్ రజాక్ గన్నవరం తీసుకెళతామని చెప్పి ఎపిఐఐసి పారిశ్రామికవాడలోకి తీసుకెళ్లారు. పొదల్లో నిర్బంధించారు. తర్వాత బాణావతు లక్ష్మణ జితేంద్రకుమార్, కొండేటి అనిల్‌కుమార్‌కు అప్పగించారు. బాలికను ద్విచాక్రవాహనంపై ఎక్కించుకున్న వీరిద్దరు కేసరపల్లిలోని ఖాళీగా ఉన్న గదికి తీసుకెళ్లారు. మద్యం, గంజాయి ఇచ్చి బిర్యానీ పెడుతూ ఉయ్యూరు నవీన్‌కుమార్, పరసా రాజేష్‌లు 14వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఎనిమిది మంది అఘాయిత్యానికి పాల్పడ్డారు. మహిళలు, బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం. వారికి పోలీస్ సేవలను

7 వీక్షణం

అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు మొబైల్ యాప్‌లు తీసుకు వచ్చాం. విద్యాసంస్థల్లో బాలికలకు గుడ్‌టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తున్నామని పోలీసులు చెప్పే మాటలు అక్కరకు రాలేదు. ఘటన తర్వాత కేసును చేదించి ఎనిమిది మంది నిందితులను అరెస్టు చేశామని పోలీసులు చెప్పడానికి పరిమితమయ్యారు.

చాపకింద నీరులా గంజాయి

ఈ దారుణంలో ఇద్దరు మైనర్లు ఉన్నారు. ఇంటర్‌నెట్ అశ్లీల సైట్‌లపై నియంత్రణ లేకపోవడంతోనే మొబైల్‌లో వాటిని చూడటానికి అలవాటుపడే కొందరు మైనర్లు దారుణాలకు పాల్పడుతున్నారని పలు సందర్భాల్లో వెలుగులోకి వచ్చింది. అయినా కేంద్రం వాటి నియంత్రణపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. మరోపక్క మత్తు యువతను చిత్తు చేస్తోంది. గంజాయి నియంత్రణకు కఠిన చర్యలు తీసుకున్నామని, బెల్ట్ షాపులు ఏర్పాటు చేస్తే ఊరుకోమని పోలీసు హెచ్చరికలు తరుచూ వింటూనే ఉన్నాం. అయితే ఈ ఘటనలో నిందితులకు ఎప్పుడు పడితే అప్పుడు గంజాయి అందుబాటులో ఉండటం పోలీసులు డొల్లతన్నాన్ని తేటతెల్లం చేస్తోంది. మద్యం మత్తు అనేక ప్రాంతాల్లో మహిళలపై దాడులకు, ఘర్షణలు, కుటుంబాల్లో కలహాలకు పురికొల్పుతోంది. బెల్ట్ షాపులను సహించమని అధికార యంత్రాంగం హెచ్చరికలు మాటలకే పరిమితమయ్యాయి. నూతన మద్యం పాలసీ వచ్చాక పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా వీధికి ఒక బెల్ట్ షాపు వెలవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిస్థితుల్లో మహిళల, బాలికల భద్రతకు బెల్ట్ షాపులు, గంజాయి పూర్తి స్థాయిలో నియంత్రించేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాల్సి ఉంది.

- డిఎస్‌ఆర్‌వి.ప్రసాద్

ప్రకృతి వనరులను భవిష్యత్తరాలకు అందిద్దాం

పిబి సిద్ధార్థలో సుస్థిర భవిష్యత్తుపై జాతీయ సదస్సు ముగింపులో వక్తలు

మాట్లాడుతున్న ఎన్విరాన్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ప్రకృతి నుండి మనం పొందే వనరులను భవిష్యత్తు తరాలకు కూడా అందించాల్సిన అవసరం అందరిపైనా ఉందని కెసిపి గ్రూప్ ఇహెచ్‌ఎస్ అండ్ సస్టైనబిలిటీ విభాగాధిపతి డాక్టర్ జి.బాలకృష్ణ అన్నారు. సుస్థిర భవిష్యత్తును నిర్ధేశించే పర్యావరణ, సామాజిక పాలనా కారకాలు అనే అంశంపై ఐసిఎస్‌ఎస్‌ఆర్-ఎస్‌ఆర్‌సి సహకారంతో పిబి సిద్ధార్థ కళాశాలలోని ఎంబిఎ విభాగం ఆధ్వర్యంలో సెమినార్ హాల్‌లో శనివారం జరిగిన జాతీయ అవగాహన సదస్సు ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన బాలకృష్ణ మాట్లాడారు. ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతున్న ప్రపంచ స్థాయి దేశాలు ప్రపంచీకరణ నేపథ్యంలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వ్యాపారాలు నిర్వహిస్తున్నాయని... కానీ... నైతిక విలువలతో పాటు ప్రామాణికాలు కూడా అవసరమని స్పష్టం చేశారు. ఏ పని చేసినా అందులోని తత్వాన్ని అర్థం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని విద్యార్థులకు సూచించారు. పర్యావరణాన్ని పరిరక్షించుకునే క్రమంలో సామాజిక బాధ్యతగా ప్రతి పారిశ్రామిక, వ్యాపారవేత్తలు, ప్రజలు కాలుష్య నియంత్రణలో భాగస్వామ్యం కావాలని పేర్కొన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్నసేఫ్ ఎన్విరాన్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ వి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా, గుంటూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 4,500 ఆసుపత్రుల నుండి తమ సంస్థ ద్వారా జీవ వ్యర్థాలను సేకరించి తద్వారా రీసైక్లింగ్ చేసి పర్యావరణ కాలుష్యాన్ని దూరం చేస్తున్నట్లు తెలిపారు. ఈ విధానం ద్వారా వ్యాధులు ప్రభలకుండా అనేక శాస్త్రీయ చర్యలు తీసుకుంటున్న చెప్పారు. జాతీయ సదస్సులో వివిధ రాష్ట్రాల నుండి విద్యావేత్తలు, పర్యావరణ, పారిశ్రామికవేత్తలు పాల్గొని పరిశోధన పత్రాలను సమర్పించారు. కార్యక్రమంలో సదస్సు డైరెక్టర్ ప్రొఫెసర్ రాజేష్ సి.జంపాల, ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, వైస్ ప్రిన్సిపాల్ ఎం.మనోరంజని, లీడ్ ఈఎస్‌జి కార్పొరేట్ రేటింగ్స్ అండ్ రీసెర్చ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ హరీష్ శ్రీవాత్సవ వంగల, ఎంఎస్‌సీఐ సీనియర్ అసోసియేట్ టి.శ్రీ శశి జోత్స్న, సదస్సు సమన్వయకర్త డాక్టర్ ఎండీఎస్ రహమాన్, అధ్యాపకులు డాక్టర్ ఎస్.బి.రాజేంద్రప్రసాద్, డాక్టర్ ఆర్.శ్రీనివాసరావు, ఎ.ఎస్.ఎన్.లక్ష్మీ, డాక్టర్ కె.అరుణ్‌కుమార్, ప్రోగ్రామర్ వి.సుజితా పద్మిని, వివిధ కళాశాలలు నుండి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిశోధన పత్రాలు సమర్పించిన వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు.

ఫెన్సింగ్ పోటీలో విద్యార్థుల ప్రతిభ

క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే సౌమ్య

ప్రజాశక్తి - నందిగామ : జాతీయ ఫెన్సింగ్ క్రీడాకారులు కోలా సుహాస్, వేమిరెడ్డి ప్రత్యూష లను నందిగామ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య అభినందించారు. శనివారం ఉదయం పుష్పగుచ్ఛమిచ్చి దుస్సాలువతో క్రీడాకారులను సన్మానించారు. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ నందిగామ నియోజకవర్గం నుండి జాతీయస్థాయి పోటీలకు వెళ్లడం తనకెంతో గర్వకారణంగా ఉందని అన్నారు. అంతేకాకుండా తన కుమారుడు కోలా సుహాస్ ఇటీవల పొన్నవరంలోని ఏకత్వ పాఠశాలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో కాంస్య పథకం సాధించి ఒడిస్సా రాష్ట్రంలోని కటక్ నగరంలో జరగబోయే జాతీయ పోటీలకు ఎంపిక అవడం తనకెంతో గర్వంగా ఉందని ఆనందాన్ని వ్యక్తపరిచారు. కాంశ్య పతకం సాధించి జాతీయ పోటీలకు ఎంపికైన ప్రత్యూషని కూడా అభినందించారు. పాఠశాల స్థాపించిన మొదటి సంవత్సరంలోనే నియోజకవర్గంలో ఉత్తమ పాఠశాలగా కొనసాగుతుందని తెలిపారు. అంతర్జాతీయ ప్రామాణాలతో కూడిన విద్యతో పాటు విద్యార్థుల మానసిక వికాసానికి సాంస్కృతిక కార్యక్రమాలు, ఆరోగ్యానికి ఆత్మ రక్షణకు క్రీడలు కూడా ఎంతో అవసరమని లక్షలాది రూపాయలతో తమ పాఠశాలలోనే రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించి నియోజకవర్గంలో అందరికీ ఆదర్శంగా నిలిచిన ఏకత్వా పాఠశాల చైర్మన్ అమరనేని రమేష్ బాబు, డైరెక్టర్స్ మనోజ్, కార్తీక్, సింధూ, శాంతి లకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులు గోగులమూడి విజయ్ కుమార్ ని కూడా ఆవిడ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో చైతన్య కళాశాల అధ్యాపకులు కోటి పాల్గొన్నారు.

25న జాబ్ మేళా

ప్రజాశక్తి - తిరువూరు : ఈ నెల 25న తిరువూరులో జాబ్ మేళా జరుగు తుందని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ ఎం.సుశీలరావు తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పనా శాఖ, సిడీప్ సంయు క్త ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి జాబ్ మేళా జరుగు తుందన్నారు. డైకిన్ ఎయిర్ కండీషనింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, పానాసానిక్ లైఫ్ సో ల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, కెఎల్ హస్లలో 390 ఉద్యోగాలను ఈ మేళాలో భర్తీ చేస్తారన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ అర్హత లు కలిగిన నిరుద్యోగ అభ్యర్థులు ఈఉద్యోగా లకు దరఖాస్తు చేసుకోవచ్చని, వివరాలకు 6301534435, 9558815667 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అందుబాటులో సామ్‌సంగ్ నూతన ఏఐ గెలాక్సీ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్, గెలాక్సీ బుక్5 సిరీస్ అందుబాటులో ఉన్నట్లు సంస్థ ప్రతినిధి కరుణాకర్ తెలిపారు . ఎం . జీ.రోడ్డు లోని శామ్సంగ్ షోరూం నందు శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు.. అత్యాధునిక పనితీరు, లీనమయ్యే ఏఐ లక్షణాలతో, గెలాక్సీ బుక్5 సిరీస్ తదుపరి స్థాయి ఉత్పాదకత, సజనాత్మకత, వినోదం కోసం రూపొందించబడింది అని తెలిపారు.. ఏఐ ఆధారిత కంప్యూటింగ్‌ను గతంలో కంటే మరింత అందుబాటులోకి తీసుకురావడానికి, ఇంటెల్ కోర్ అల్ట్రాతో గెలాక్సీ బుక్5 సిరీస్ ఇప్పుడు రూ. 114900 నుండి ప్రారంభమవుతుంది అని అన్నారు.. గెలాక్సీ బుక్5 సిరీస్‌ను కొనుగోలు చేసే కస్టమర్‌లు రూ. 10 వేల వరకు బ్యాంక్ క్యాష్‌బ్యాక్, గెలాక్సీ బడ్స్ 3 ప్రోను కేవలం రూ. 7999 పొందవచ్చు అన్నారు. ఈ పరికరాలు 24 నెలల వరకు ఎటువంటి ఖర్చు లేని ఈఎంఐ ఎంపికతో కూడా అందుబాటులో ఉన్నాయి.అని తెలిపారు .అదనంగా, విద్యార్థులు ప్రత్యేకంగా 10 శాతం తగ్గింపును పొందవచ్చు.అని తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం
పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...
మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218
విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.